మానేరు జనత ®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

06.03.2025 గురువారం Thursday | సంపుటి (Volume): 09 సంచిక (Issue) : 323 | పేజీలు : 8 Pages : 8 | Published from : Karimnagar

## ఫైనల్‌కు న్యూజిలాండ్.. ఇక భారత్‌తో అమీతుమీ



07

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్




02

మిగులు జలాలపై
## కేంద్రానికి లేఖ రాయండి
చంద్రబాబుకు హరీష్ రావు సవాల్



ప్రశ్నించినందుకే
## సస్పెండ్
- బెదిరింపులకు భయపడేది లేదు
- తీన్మార్‌మల్లన్న

03



## నేను ఆత్మహత్య చేసుకోలేదు
- అధికమొత్తంలో నిద్రమాత్రలు వాడా
- పోలీసులకు వాంగ్మూలం ఇచ్చిన గాయని కల్పన

# అంతర్గత విషయాలు బయట చర్చిస్తే ఖబడ్దార్

### నటనలు మాని.. పార్టీ కోసం పని చేయండి

### కాంగ్రెస్ శ్రేణులకు మీనాక్షి నటరాజన్ హెచ్చరిక



**పార్టీ అంతర్గత విషయాలపై బయట చర్చ పెట్టొద్దని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. అంతర్గత విషయాలపై బయట చర్చ పెట్టిన వారిపై చర్యలు తప్పవని అన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ అనుబంధ సంఘాల సమావేశంలో ఆమె మాట్లాడారు. నివేదికలు ఇవ్వకపోయినా వారి పనితీరు ఏంటనేది తమకు తెలుస్తుందని అన్నారు.**

**హైదరాబాద్, జనతా న్యూస్:** పార్టీ కోసం పనిచేస్తున్నది ఎవరు..? పనిచేసినట్టు యాక్టింగ్ చేస్తున్నది ఎవరనేది కూడా తెలుస్తుందంటూ చురకలు అంటించారు. పార్టీ కోసం సమయం ఇవ్వండి.. పార్టీ అంతర్గత విషయాలు బయట చర్చ చేయకండి.. అలాంటి వారిపై చర్యలు తప్పవు అని హెచ్చరించారు.

మిగతా 2 లో

## సీఎంను కలిసిన సీపీఐ బృందం



**హైదరాబాద్, జనతా న్యూస్:** సీఎం రేవంత్ రెడ్డిని ఆయన స్వగృహంలో సీపీఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు గురించి కొద్దిసేపు చర్చించారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానిక పరిస్థితుల ప్రభావం ఉంటుంది తప్పితే ఆయా పార్టీలు అలాగే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాల విధానాలు ప్రతిబింబించవని అన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు షాక్

- రెండు స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీ
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా అంజిరెడ్డి గెలుపు
- సత్తాచాటి కాంగ్రెస్‌కు సవాల్ విసిరిన బీజేపీ



## కేంద్రం ఆదుకుంటున్నా.. నిందలు వేస్తారా?



- నవోదయ పాఠశాలలు తెస్తే పట్టించుకోరా
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్

03

# 15 నెలల్లోనే రూ. 1.65 లక్షల కోట్ల అప్పు

**నాడు అప్పులు చేసి ప్రజల కష్టాలు తీర్చితే..**

**నేడు అప్పులు చేసి జేబులు నింపుకుంటున్న సీఎం రేవంత్**



03

నాడు బీఆర్ఎస్ చేసిన అప్పులపై ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ.. నేడు 15 నెలలకాలంలోనే రూ. 1.65 లక్షల కోట్లు అప్పులు చేశారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. నాడు అప్పు చేసి 70 లక్షల అన్నదాతలకు అండగా నిలిచి వారికి రైతుబంధు కళ్యాణలక్ష్మి, వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు, 30 మెడికల్, నర్సింగ్ కాలేజీలను ఏర్పాటుచేస్తే అప్పులు తప్పని రాద్ధాంతం చేశారని విమర్శించారు.

## అగ్రకులాల నాయకులు తప్పులు చేస్తే చర్యలు తీసుకోరా?

- కాంగ్రెస్ పార్టీపై సీనియర్ నేత మధుయాష్కీ సంచలన వ్యాఖ్యలు



# ఎమ్మెల్యేకే న్యూడ్ కాల్

**వేముల వీరేశంను వదలని సైబర్‌నేరగాళ్లు**


**డబ్బులు ఇవ్వకుంటే సోషల్‌మీడియాలో పెడతామని బెదిరింపు**

**స్క్రీన్‌రికార్డు చేసి బ్లాక్ మెయిలింగ్**

నకిరేకల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు సైబర్ నేరగాళ్లు న్యూడ్ వీడియో కాల్ చేశారు. ఈ ఘటన రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



02



02

## వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధింపు

కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ట్రంప్ ప్రకటన

## రాహుల్‌గాంధీకి రూ.200 జరిమానా

- పలుమార్లు కేసు విచారణకు గైర్హాజరు
- యూపీ కోర్టు తీర్పు



02

## టన్నెల్ ప్రమాదం దురదృష్టకరం

- చురుకుగా సహాయక చర్యలు
- కార్పోరేట్‌కు దీటుగా జూనియర్ కాలేజీలు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



02

నల్లగొండ వరప్రదాయిని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలడం చాలా దురదృష్ట కరమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ పూర్తి అయితే నల్గొండ నియోజకవర్గం పూర్తిగా సస్యశ్యామలమవుతుందన్నారు. టన్నెల్ వద్ద సహాయక పనులు చురుకుగా సాగుతున్నాయని, బిఆర్ఎస్ అర్థం లేని విమర్శలను పట్టించుకోబోమని అన్నారు.

## అమెరికాలో కాల్పులు

**షాద్‌నగర్‌కు చెందిన విద్యార్థి మృతి**



షాద్‌నగర్‌కు చెందిన విద్యార్థి అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా కేశంపేట గ్రామానికి చెందిన గంప ప్రవీణ్ (27) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అమెరికాలో ప్రవీణ్ నివాసం ఉండే ఇంటికి దగ్గర్లోని బీచ్ వద్ద గన్‌తో కాల్చడంతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

# అంతర్గత విషయాలు బయట చర్చిస్తే ఖబడ్దార్

మొదటి పేజీ తరువాయి

తన పని తీరు నచ్చకపోయినా.. రాహుల్, సోనియాకు ఫిర్యాదు చేయొచ్చు అన్నారు. ఐదు రోజుల క్రితం మధ్య ప్రదేశ్ నుంచి రైలులో హైదరాబాద్?కు వచ్చిన మీనాక్షి నటరాజన్.. పార్టీని సెట్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. సింప్లిసిటీకి ప్రాధాన్యం ఇస్తూ.. అంతర్గతంగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతూ ఆమె సమావేశాలు సాగుతున్నాయి.తన దృష్టిలో పడాల్సిన అవసరం లేదంటూనే.. పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేయాలని నేతలకు సూచిస్తున్నారు. ఇవాళ ఉదయం పీసీసీ చీఫ్?మహేశ్ కుమార్ గౌడ్?తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన మీనాక్షి నటరాజన్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై చర్చించారు. అనంతరం పార్ట అనుబంధ సంఘాల నాయకులతో మాట్లాడారు. తర్వాత ఆదిలాబాద్ జిల్లా నేతలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కీలక అంశాలను ప్రస్తావిస్తూనే పలువురికి చురకలు అంటించారు.



## అమెరికాలో మరో తెలుగు విద్యార్థి బలి



**రంగారెడ్డి, మార్చి 5 :** ఉన్నత చదువుల కోసం అగ్రరాజ్యం అమెరికా వెళ్లిన మరో తెలుగు విద్యార్థి బలయ్యాడు. దుండగుడు జరిపిన కాల్పుల్లో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల కేంద్రానికి చెందిన గంప రాఘవులు-రమాదేవి దంపతులకు కొడుకు ప్రవీణ్(27), కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రవీణ్ కొంతకాలం కిందట ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అక్కడ విస్కాన్సిన్ మిల్వాంకిలో నివాసం ఉంటున్నాడు. అక్కడే యూనివర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఖర్చుల కోసం ఓ స్టార్ హోటల్‌లో పార్ట్‌టైం జాబ్ చేస్తున్నాడు. ఇదిలా ఉంటే ప్రవీణ్ నివాసం ఉండే ఇంటికి సమీపంలోని బీచ్ దగ్గర తాజాగా ఓ దుండగుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో గాయపడ్డ ప్రవీణ్ అక్కడికక్కడే మరణించారు. ప్రవీణ్ మరణవార్తను అతని స్నేహితులు ఇండియాలోని కుటుంబసభ్యులకు తెలియజేశారు. దీంతో అతని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రవీణ్ మృతితో కేశంపేట మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మిగులు జలాలపై కేంద్రానికి లేఖ రాయండి

### చంద్రబాబుకు హరీష్ రావు సవాల్



**సిద్దిపేట, మార్చి 5 :** మిగులు జలాలే వాడుకుంటున్నామని అంటున్న చంద్రబాబు..దమ్ముంటే తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరం లేదని చెప్పాలని ఎపి సీఎం చంద్రబాబుకు మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ విసిరారు. 'మీకు నిజంగా తెలంగాణపై ప్రేమ ఉంటే సమ్మక్క సారక్క, సీతమ్మ సాగర్, వార్ధా ప్రాజెక్టు, కాళేశ్వరంలో మూడో ప్రాజెక్టుకి అనుమతులు ఇవ్వమని కేంద్రానికి చెప్పండి. లేఖ రాయండని సవాల్ చేశారు. అప్పుడు మేము మీకు నిజంగా తెలంగాణపై ప్రేమ ఉందని నమ్ముతాం. మీ రెండు కళ్ళ సిద్ధాంతం కరెక్ట్ అని చెబుతాం. కేంద్ర బడ్జెట్ లో మీ వాటా మీరు తీసుకున్నారు.. మరి తెలంగాణకి ఎందుకు ఇవ్వలేదని ఎందుకు ప్రశ్నించలేదు. మీకు తెలంగాణపై ప్రేమ లేదు.. మా హక్కుల కోసం ఏనాడు పోరాడలేదు. గోదావరిలో తెలంగాణకి 969 టీఎంసీల నీటిని కేటాయించారు. అవి మమ్మల్ని వాడుకొనివ్వండి.' అని హరీష్ రావు వ్యాఖ్యానించారు. మీరు మాట్లాడుతున్నదానికి మీ చేతలకు సంబంధం లేదని సీఎం చంద్రబాబును హరీష్ రావు విమర్శించారు. వైజాగ్ ఉక్కు పరిశ్రమలాగా మా ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీని కాపాడాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చినట్టు పాలమూరు ప్రాజెక్టుకి జాతీయ హోదా అడగాలన్నారు. ఇక్కడ ఉన్న ఎంపీలు పార్లమెంట్లో మౌనం వహిస్తున్నారని.. ఇంత జరుగుతున్న సీఎం రేవంత్ ఎందుకు మౌనంగా ఉంటున్నారని విమర్శలు గుప్పించారు. 8మంది ఎంపిలున్న బిజెపి మాట్లాడదు..కాంగ్రెస్ ఎంపిలు నిలదీయడం లేదని మండిపడ్డారు.

## అగ్రకులాల నాయకులు తప్పులు చేస్తే చర్యలు తీసుకోరా?

### కాంగ్రెస్ పార్టీపై సీనియర్ నేత మధుయాష్కీ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మార్చి 5:** కాంగ్రెస్ పార్టీలో రెడ్లు, అగ్రకులాల వాళ్లు ఎలాంటి క్రమశిక్షణ ఉల్లంఘన పనులు చేసినా చర్యలు తీసుకోరు అని మధుయాష్కీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డే క్రమశిక్షణ తప్పాడని ఆయన పేర్కొన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యే మేఘా రెడ్డిపై బహిరంగంగా ఆరోపణలు చేశాడు.. మరి క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడిపై క్రమశిక్షణ చర్యలు ఉండవా? అని ప్రశ్నించారు. కులగణన మీద బీసీ నాయకులతో రేవంత్ రెడ్డి మీటింగ్ పెడితే దానికి జానారెడ్డిని, కేశవరావును పిలిచారు కానీ బీసీ నాయకుడినైనా నన్ను పిలవలేదు అని కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను ఇటీవలే సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే పార్టీ నుంచి ఎమ్మెల్సీ మల్లన్నను సస్పెండ్ చేసినట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. పలు సభల్లో రెడ్లను తీన్మార్ మల్లన్న బహిరంగంగా విమర్శించిన నేపథ్యంలోనే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు రాజకీయ నిపుణులు పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకే సస్పెండ్ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా కమిటీ సంఘం తెలిపింది.

## నేను ఆత్మహత్య చేసుకోలేదు

**హైదరాబాద్,మార్చి5 :** తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడలేదని, తన కుమార్తె విషయంలో చోటుచేసుకున్న మనస్పర్థల వల్ల నిద్ర పట్టక అధిక మొత్తంలో నిద్ర మాత్రలు వేసుకోవడం వల్ల అపస్మారక స్థితిలోకి వెళ్లినట్టు గాయని కల్పన తెలిపారు. ఈ విషయానికి సంబంధించి కేపీహెచ్‌బీ పోలీసులు ప్రెస్‌నోట్ విడుదల చేశారు. 'కల్పన గత 5 సంవత్సరాల నుంచి భర్తతో కలిసి హైదరాబాద్‌లోని విల్లాలో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె దయ ప్రసాద్‌కి, కల్పనకు మధ్య చదువు విషయంలో ఇటీవల మనస్పర్థలు వచ్చాయి. అనంతరం ఆమె హైదరాబాద్‌కు చేరుకున్నారు. అదే సమయంలో కల్పన భర్త ప్రసాద్.. ఆమెకు పలుమార్లు ఫోన్ చేయగా స్పందన లేదు. దీంతో, ప్రసాద్ కాలనీ వెల్ఫేర్ సభ్యులకు ఫోన్ చేసి చెప్పగా, వారు ఆఎంఒ 100కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కేపీహెచ్‌బీ పోలీసులు, కాలనీ వెల్ఫేర్ మెంబర్స్ ఇంటి తలుపులు తెరిచేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో వెనుక వైపు ఉన్న కిచెన్ డోర్ నుంచి లోపలికి ప్రవేశించి, బెడ్ రూమ్‌లో అపస్మారక స్థితిలో ఉన్న కల్పనను సమీపంలోని ఆస్పత్రికి తరలించాం ' అని పోలీసులు వెల్లడించారు. తాను ఆత్మహత్యాయత్నం చేయలేదని, ఈ ఘటనలో ఎవరి ప్రమేయం లేదని కల్పన చెప్పినట్టు పోలీసులు పేర్కొన్నారు. తనకు, తన కుమార్తెకు జరిగిన విషయంలో నిద్ర పట్టక అధిక మొత్తంలో నిద్ర మాత్రలు వేసుకోవడం వల్ల ఇలా జరిగిందని ఆమె వెల్లడించినట్టు తెలిపారు.

## ఎమ్మెల్యేకే న్యూడ్ కాల్



**హైదరాబాద్, మార్చి 5:** రాష్ట్రంలో సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంను టార్గెట్ చేసి న్యూడ్ కాల్స్‌తో బెదిరింపులకు దిగారు. న్యూడ్ వీడియో కాల్‌ను రికార్డు చేసి ఆయన మొబైల్‌కు పంపించడమే కాకుండా.. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివరాల ప్రకారం.. నకిరేకల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు నిన్న రాత్రి సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేశారు. ఆ కాల్ లిఫ్ట్ చేయగానే అవతలి అమ్మాయి నగ్నంగా కనిపించింది. మొబైల్ స్క్రీన్‌పై ఆ సీన్ చూడగానే వేముల వీరేశం ఫోన్ కట్ చేశాడు. కానీ అదంతా స్క్రీన్ రికార్డు చేసిన సైబర్ నేరగాళ్లు.. ఆ వీడియోను ఆయనకే పంపించారు. తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆ వీడియోను కుటుంబసభ్యులు, మిత్రులకు పంపించడమే కాకుండా సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. కానీ ఆయన స్పందించకపోవడంతో ఆ వీడియోను కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు పంపించారు. ఆ వీడియో చూసిన వెంటనే సదరు నేతలు, కార్యకర్తలు వేముల వీరేశానికి ఫోన్ చేసి ఆరా తీశారు. దీంతో కంగుతిన్న ఎమ్మెల్యే.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. పోలీసుల సలహాలతో సైబర్ నేరగాళ్ల నంబర్‌ను బ్లాక్ చేయాలని ఎమ్మెల్యేకు సూచించారు.

## రాహుల్‌గాంధీకి రూ.200 జరిమానా



**లక్నో, మార్చి 5:** ఓ కేసు విషయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఉత్తర్‌ప్రదేశ్‌లోని న్యాయస్థానం రూ.200 జరిమానా విధించింది. పదే పదే విచారణకు గైర్హాజరు అవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 14న తదుపరి విచారణకు హాజరు కాకుంటే మాత్రం తీవ్ర చర్యలుంటాయని రాహుల్ గాంధీని హెచ్చరించింది. మహారాష్ట్రలో 2022లో మీడియా సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. వీర్ సావర్కర్ బ్రిటిష్ సేవకుడని, వారి నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు స్వాతంత్య్ర సమరయోధుడైన వీర్ సావర్కర్‌ను కించపరిచే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే వ్యక్తి యూపీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేవిధంగా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని అందులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌కు సంబంధించి తాజాగా మరోసారి విచారణ జరిగింది. రాహుల్ గాంధీ తరఫున న్యాయవాది ప్రన్షు అగర్వాల్ హాజరై.. ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ బిజీగా ఉన్నారని, వ్యక్తిగత హాజరుకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అయితే, పదే పదే విచారణకు గైర్హాజరవుతున్న నేపథ్యంలో ఆయనకు రూ.200 జరిమానా విధించిన అప్పర్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం.. తదుపరి విచారణకు రాహుల్ తప్పకుండా హాజరు కావాలని ఆదేశించింది. లేని పక్షంలో నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంటు జారీ చేస్తామని హెచ్చరించింది.

## వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధింపు


### కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్, మార్చి 5:** వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. తాజాగా ట్రంప్ కాంగ్రెస్ సంయుక్త సెషన్‌లో ప్రసంగించారు. దాదాపు గంట 40 నిమిషాల పాటు ట్రంప్ ప్రసంగించారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ సెషన్‌లో ప్రసంగించడం ఇదే తొలిసారి. ఈ సెషన్‌లో భారత్, చైనా, కెనడా దేశాలపై సుంకాలు విధించనున్నట్లు స్పష్టం చేశారు. భారత్, చైనా సహా పలు దేశాలపై ఏప్రిల్ 2 నుంచి అమలులోకి రానున్నట్లు ట్రంప్ ప్రకటించారు. కొన్ని దశాబ్దాలుగా అమెరికాపై కొన్ని దేశాలు అధిక సుంకాలు విధిస్తున్నాయి. యూరోపియన్ యూనియన్, చైనా బ్రెజిల్, భారత్ వంటి చాలా దేశాలు తమ నుంచి అధిక సుంకాలు వసూలు చేస్తున్నాయి. ఇది చాలా అన్యాయం అని ట్రంప్ చెప్పారు. భారత్ అమెరికాపై వంద శాతం కంటే ఎక్కువ సుంకాలు వసూలు చేస్తుంది. ఇక అమెరికా వసూలు చేసే దానికంటే చైనా రెండింతలు ఎక్కువగా సుంకాలు విధిస్తోంది. ఇప్పుడు తాను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత తాము కూడా సుంకాలు విధించేందుకు సిద్ధమయ్యామని ట్రంప్ తెలిపారు. ఏ దేశాలు.. తమ ఉత్పత్తులపై ఎంత టారిఫ్‌లు విధిస్తాయో.. తాము కూడా అంతే సుంకాల్ని వసూలు చేస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. తన దేశం ఎదుర్కొంటోన్న ద్రవ్యోల్బణ సమస్య గురించి ప్రస్తావిస్తూ.. జో బైడెన్ పాలనలోని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. చమురు, గ్యాస్ తవ్వకాల గురించి తన ఆలోచనలు వెల్లడించారు. ఏ దేశానికీ లేనివిధంగా మన కాళ్ల కింద ద్రవరూప బంగారం (చమురు, గ్యాస్‌ను ఉద్దేశించి) ఉందని, అది ద్రవ్యోల్బణ సమస్యను తీరుస్తుందని అన్నారు. 'ద్రవ్యోల్బణ సమస్యను పారదోలడం కోసం మేం చేసే పోరాటంలో భాగంగా ఇంధన వ్యయాన్ని వేగంగా తగ్గించడంపై దృష్టిపెట్టాం. బైడెన్ పాలనలో 100కు పైగా విద్యుత్ ఎ÷-లాంట్లు మూసివేశారు. వాటిలో చాలా ఎ÷-లాంట్లను మేం ఇప్పుడు తెరవబోతున్నాం. అందుకే నేను అధికారంలోకి రాగానే జాతీయ ఇంధన అత్యవసర పరిస్థితిని విధించాను. మన కాళ్ల కింద బంగారాన్ని తోడటం ద్వారా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు.

## ఫలించిన హరీశ్‌రావు ప్రయత్నం

### రంగనాయకసాగర్‌కు నీటి ఎత్తిపోతలు ప్రారంభం

**సిద్దిపేట, మార్చి 5:** సిద్దిపేట నియోజకవర్గ రైతుల పక్షాన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన ప్రయత్నం ఫలించింది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ మీదుగా రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి తక్షణమే నీటిని ఎత్తిపోయాలని హరీశ్ రావు ఇటీవల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖకు స్పందన లేకపోవడంతో ఫోన్ చేసి మాట్లాడారు. రైతుల కష్టాల గురించి క్షుణ్ణంగా చర్చించారు. వెంటనే నీరు ఎత్తిపోయకుంటే 50 వేల ఎకరాల్లో పంట ఎండిపోతుందని.. రైతులంతా తీవ్రస్థాయిలో నష్టపోతారని.. క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యాసంగి పంట చేతికొచ్చేదాకా సాగునీటిని అందుబాటులో ఉంచాలని.. గడిచిన నాలుగేళ్ల పాటు సాగునీరు అందించిన తీరును వివరించారు. కనీసం 1టీఎంసీ నీటిని ఎత్తిపోయాలని కోరారు. ఈ క్రమంలోనే ఈ రోజు ఉదయం అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయక సాగర్‌లోకి గోదావరి జలాలు ఎత్తిపోయడం ప్రారంభించారు. ఇదిలా ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని.. ఎందుకూ పనికిరాదని విమర్శలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వమే నేడు ఇదే కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగాలైన అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్ల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోస్తూ పంటలకు నీరందిస్తున్నారనే చర్చ జరుగుతున్నది.



## టన్నెల్ ప్రమాదం దురదృష్టకరం

### చురుకుగా సహాయక చర్యలు
### కార్పొరేట్ కాలేజీలకు దీటుగా జూనియర్ కాలేజీలు
### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

**నల్లగొండ, మార్చి 5:** నల్లగొండ వరప్రదాయిని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలడం చాలా దురదృష్ట కరమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ పూర్తి అయితే నల్గొండ నియోజకవర్గం పూర్తిగా సస్యశ్యామలమవుతుందన్నారు. టన్నెల్ వద్ద సహాయక పనులు చురుకుగా సాగుతున్నాయని, బిఆర్ఎస్ అర్థం లేని విమర్శలను పట్టించుకోబోమని అన్నారు. కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కనగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేంద్ర యూనివర్సిటీ సౌజన్యంతో గ్లూకోమా టెస్టింగ్ మిషన్లను నూతనంగా ఏర్పాటు చేసిన కనగల్ పీహెచ్సీలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొట్టమొదటగా కనగల్ మండల కేంద్రాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకొని మార్చి 6 నుంచి 300 మందికి గ్లూకోమ టెస్టులు చేయనున్నామని చెప్పారు. 40 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు గ్లూకోమా టెస్టులకు సహకరించాలని కోరారు. మెరుగైన వైద్యం కోసం ప్రతి నియోజకవర్గంలో మోడల్ పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని.. తొందరలోనే ప్రతి నియోజకవర్గంలో మోడల్ పీహెచ్?సీ ఏర్పాటు చేస్తామన్నారు. కనగల్ మండల కేంద్రంలోని తిమ్మన్నగూడెం నుండి సాగర్ హైవేకు రూ.15 కోట్లతో నిధులు మంజూరు అయ్యాయని.. అతి త్వరలో రోడ్డు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే.. గ్రామాలలో లింకు రోడ్లను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కనగల్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల మంజూరు చేశామని.. వచ్చే అకాడమీకి ఇయర్ నాటికి బిల్డింగ్ పూర్తి చేసి కాలేజీ ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే.. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ హాస్టల్స్?కు నూతన బిల్డింగులను కట్టిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సమయంలో కూడా కలెక్టర్ ఇలా త్రిపాఠి నిర్విరామంగా జిల్లా మొత్తం తిరుగుతూ.. ఆయా మండలాలలోని ప్రభుత్వ హాస్పిటల్స్, ప్రభుత్వ హాస్టల్స్?ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ జిల్లాను సురక్షితంగా చూసుకుంటున్నారని.. ఇలాంటి కలెక్టర్ మన జిల్లాలో పని చేయడం అదృష్టమన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఎంహెచ్ఓ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ ఓ కళ్యాణ్ చక్రవర్తి, మండల పీహెచ్సీ డాక్టర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మండల ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## తగ్గుతున్న రాత్రిపూట ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, మార్చి 5:** రాబోయే రెండు రోజులు తెలంగాణలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోనున్నట్లు వాతావరణశాఖ నిపుణుడు టీ బాలాజీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రజలకు కొంత ఉపశమనం లభించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల, పెద్దపల్లి, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాలు కాస్త కూల్‌గా మారనున్నాయి. ఆ జిల్లాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు తగ్గనున్నట్లు పేర్కొన్నారు. రాత్రితో పాటు తెల్లవారుజామున కూడా టెంపరేచర్లు కూల్‌గా ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం వేళ యధావిధిగా ఉష్ణోగ్రతలు ఉంటాయన్నారు. కొంత వరకు హీట్ నుంచి రిలీఫ్ ఉంటుందన్నారు. హైదరాబాద్ నగర ప్రజలకు కూడా కొంత గుడ్‌న్యూస్ చెప్పారు. ఇవాళ్టి రాత్రి నుంచి హైదరాబాద్‌లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గనున్నట్లు తెలిపారు. అయితే నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో హీట్ ఉన్నా.. ఉదయం పూట మాత్రం టెంపరేచర్లు తగ్గనున్నట్లు వెల్లడించారు. ఇక నగర శివార ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పడిపోనున్నట్లు చెప్పారు. ఉత్తర భారతం నుంచి అకస్మాత్తుగా వీస్తున్న చలిగాలుల వల్ల ఈ మార్పు ఉంటుందన్నారు. ఉత్తర తెలంగాణ దిశగా ఆ శీతల గాలులు వీస్తున్నట్లు చెప్పారు. మార్చి 6, 7 తేదీల్లో.. ఉదయం ఉష్ణోగ్రతలు 10 నుంచి 12 డిగ్రీల మధ్య ఉండనున్నాయి. ఇక మధ్యాహ్నం మాత్రం 35 నుంచి 36 డిగ్రీల సెల్సియస్ ఉండనున్నది. మార్చి 5, 7 తేదీల్లో హైదరాబాద్‌తో పాటు దక్షిణ తెలంగాణ జిల్లాల్లో హీట్ నుంచి రిలీఫ్ ఉంటుందన్నారు. ఉదయం పూట 14 నుంచి 15 డిగ్రీల టెంపరేచర్ ఉండనున్నది. ఇక మార్చి 9వ తేదీ తర్వాత మళ్లీ ఉష్ణోగ్రతలు మండనున్నాయి.

# బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకై మల్లన్న మాటలు

- ఏఐసీసీ అధినేతతో పోల్చుకునే స్థాయి మల్లన్నకు లేదు
- సమయం ఇచ్చినా స్పందించలేదు
- మంత్రి సీతక్క ఆగ్రహం



**హైదరాబాద్, మార్చి 5:** ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీతో తీన్మార్ మల్లన్న పోల్చుకునే స్థాయి అతనికి లేదని మంత్రి సీతక్క అన్నారు. మల్లన్న వ్యాఖ్యలపై ఆమె బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తల శ్రమతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. కొందరు నేతలు బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకలై మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ చేయలేనిది తాము చేశామని.. అభినందించాల్సింది పోయి విమర్శలు చేస్తారా అని ప్రశ్నించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో పోల్చుకునే స్థాయి మల్లన్నది కాదని చెప్పారు. కులగణనపై అభ్యంతరాలు ఉంటే శాసనసమండలిలో మాట్లాడాలని అన్నారు. కులగణనకు 50 రోజుల సమయం ఇచ్చామని.. అది సరిపోదా అని మంత్రి సీతక్క నిలదీశారు. కాగా.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో మంత్రి సీతక్క, షబ్బీర్ అలీ, జానారెడ్డి, జీవన్ రెడ్డి, వీహెచ్ తదితరులు విడివిడిగా గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తమ అభిప్రాయాలను చెప్పాలని పీఏసీ సభ్యులను మీనాక్షి నటరాజన్ కోరారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై ఏఐసీసీ కార్యదర్శి వంశీ చంద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లన్న వ్యాఖ్యలను ఖండించారు. తన ఓటమికి సీఎం రేవంత్ రెడ్డి కారణం అంటూ మల్లన్న చేసిన వ్యాఖ్యలు కేవలం తన ఉనికి కోసమే అని చెప్పారు. తాను మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా పోటీ చేయాలన్నది అధిష్ఠానం నిర్ణయమని తెలిపారు. తన గెలుపు కోసం సీఎం రేవంత్ రెడ్డి ఎంతో శ్రమించారని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాల్లో భాగంగానే మహబూబ్ నగర్‌లో బీజేపీ గెలిచిందని అన్నారు. ఎమ్మెల్సీ కవిత జైల్లో ఉండటంతో ఆమెను బయటకు తీసుకు రావడం కోసం బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి అమ్ముడుపోయిందని ఆరోపించారు. గతంలో కేసీఆర్ లాంటి నేతలు ఎంపీగా పని చేసిన మహబూబ్‌నగర్ సిట్టింగ్ సీట్లో బీఆర్ఎస్ డిపాజిట్ కోల్పోయి బీజేపీకి మద్దతు ఇచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి నుంచి గ్రామ స్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ తన గెలుపు కోసం సమష్టిగా కృషి చేశారని వంశీ చంద్ రెడ్డి పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై జానారెడ్డి స్పందించారు. కులగణన అంశంలో తన పాత్ర లేదని చెప్పారు. మల్లన్న గాలి మాటలు మాట్లాడితే కుదరదని హెచ్చరించారు. తప్పు చేసిన వాడిని క్షమించే గుణం తనదని అన్నారు. తనను ఎవరూ తిట్టిన తాను పట్టించుకోనని చెప్పారు. తీన్మార్ మల్లన్న సమావేశంతో తనకు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. ప్రత్యేక్ష రాజకీయాలకు తాను దూరం. సలహాలు అడిగితే ఇస్తానని తెలిపారు. పరిపాలన చేసే వారు సైతం ఆడిగితేనే సలహాలు, సూచనలు ఇస్తానని అన్నారు. తమ నాయకులు తనను విమర్శిస్తే ఖండిస్తాలేరన్నారు. అలాగని సమర్ధించడం లేదని చెప్పారు. ఎందుకో వారినే అడిగి తెలుసుకోవాలని జానారెడ్డి అన్నారు. తీన్మార్ మల్లన్న అంశం తనకు సంబంధం లేదని మాజీ ఎంపీ వీ. హనుమంతురావు అన్నారు. పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని మీనాక్షి నటరాజన్‌కు చెప్పానని అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో వీహెచ్ మీడియాతో మాట్లాడారు. మీనాక్షి నటరాజన్ తనను ఏమి అడగలేదని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని మీనాక్షి నటరాజన్‌కు చెప్పానని హనుమంతురావు అన్నారు.

# కేంద్రం ఆదుకుంటున్నా.. నిందలు వేస్తారా

**నవోదయ పాఠశాలలు తెస్తే పట్టించుకోరా**

**సిఎం రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డ ధర్మపురి**



**నిజామాబాద్, మార్చి 5:** కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తున్నా.. సిఎం రేవంత్ రెడ్డి అవన్నీ మరచి ..కేంద్రం ఇస్తోంది.. కానీ కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని చేసిన వ్యాఖ్యలు సత్యదూరమని నిజాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు.. ఇటీవల ఓ సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణకు మోడీ 7 జవహర్ నవోదయ విద్యాలయాలు ఇచ్చారు. నా పార్లమెంట్ పరిధిలో జగిత్యాల, నిజామాబాద్ లో ఒకటి చొప్పున రెండు వచ్చాయి. పార్టీలకతీతంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కూడా మాట్లాడాను. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఎక్కువగా చేరుతారు కాబట్టి జిల్లా కేంద్రంలో పెట్టాలని నిర్ణయించాం. నిజామాబాద్ లో స్టార్ట్ అయింది.. ఆల్రెడీ కొనసాగుతోంది. బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఆర్మూర్ లో పెట్టాలని ప్రెజర్ పెడితే నేను ఆయన్ను ఒప్పించుకున్నా. అన్నీ ఒకే అనుకున్నాక బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నిజాం షుగర్ ఫ్యాక్టరీ ల్యాండ్ ఇచ్చారు. ఆ ల్యాండ్ ఇవ్వడాన్ని బట్టి చూస్తే నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరవనట్టేనా. వీళ్లకు పని చేయడం చేతకాదు. చేస్తున్న వారిని చేయనివ్వకుండా అడ్డుపడుతున్నారు. సుదర్శన్ లెటర్ హెడ్ కూడా కొట్టించుకోవడం లేదు. మంత్రి పదవి ఇచ్చాకే లెటర్ హెడ్ సిద్ధం చేసుకుంటాడట. ఆయనకు మతిస్థిమితం లేకుండా పోయిందని అననారు. పనికిమాలిన రాజకీయాలతో మంచి ఇనిస్టిట్యూట్ లు రాకుండా పోతున్నాయి. గల్లీ లీడర్ లాగా మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఇంకా బుద్దిలేకుండా మంత్రి పదవి కావాలని కోరుతున్నారు. నయా పైసా పని చేయడని కేవలం మైనార్టీ ఓట్లతో గెలుస్తున్నాడని ఎంపీ ధర్మపురి అరవింద్ వ్యాఖ్యానించారు.మంత్రి శ్రీధర్ బాబు మేము పరిశీలిస్తున్నామన్నాడు.. ఇదేనా పరిశీలించడం అని బీజేపీ ఎంపీ ప్రశ్నించారు. 'మీకు నేను స్కూల్ తెస్తుంటే ఇలా బురదజల్లుతారా?. సుదర్శన్ రెడ్డి మెదడు మోకాలుకు జారింది.. ఇప్పుడు అరి కాళ్లకు జారుతుంది. చటాకు మెదడు ఉన్న ఎవడైనా మోడీతో మంచిగా ఉంటాడు. ట్రంప్ లాంటి వ్యక్తే మోడీతో మంచిగున్నాడు. కుర్చీలో దగ్గరుండి కూర్చోపెడుతున్నాడు. రేవంత్ ఒక లెక్కనా. రేవంత్ వస్తానంటే బీజేపీలోకి ఆహ్వానిస్తాం. దానికి ఎమ్మెల్సీ ఎన్నికలే నిదర్శనం. రాహుల్ గ్రహాంతరవాసి. సీఎం పదవి తొలగిస్తే రేవంత్ చూస్తూ ఊరుకుంటాడా? నిజంగా అదే జరిగితే వ్యక్తిగతంగా బీజేపీలోకి ఆహ్వానిస్తా. ఆయన్ను తీసుకుంటారా? లేదా అనేది మాత్రం నా చేతిలో లేదు. కిషన్ రెడ్డిని తిట్టాడు కాబట్టి ఆయన తీసుకుంటారా లేదా అనేది చూడాలి. బీజేపీ నేతలు సీఎం చెవిలో ప్రాజెక్టును అడ్డుకుంటున్నారని ఎలా అంటారు. కాంగ్రెస్ నేతలు, రేవంత్ కూడా నాకు మిత్రుడే. ఫ్యూచర్ సిటీకి లోటస్ అని పేరు పెడతాడేమో.. అందుకే మోడీని మంచోడని పొగుడుతున్నట్టున్నాడు. అలా పెట్టుకుంటామంటే కచ్చితంగా అనుమతిస్తాం. పసుపు బోర్డు గురించి విమర్శలు చేస్తున్న కవితపై స్పందించమని మా జిల్లా నేతలకు చెబుతా. అలాంటి ఔట్ డేటెడ్ లీడర్ల గురించి మనం మాట్లాడుకోవడం ఎందుకని ఎంపీ ధర్మపురి అరవింద్ స్పష్టం చేశారు.

# పోలీసుల ఔదార్యం

**ఇంటర్ విద్యార్థిని సకాలంలో పరీక్షా సెంటర్ తీసుకెళ్లిన సీఐ,ఎస్ఐ**

**జనగామ, మార్చి 5:** ఖాకీలంటే కాఠిన్యమే కాదు, కరుణను సైతం పంచుతారనే ఉదంతం జనగామలో చోటు చేసుకుంది. పోలీసులు సకాలంలో విద్యార్థినిని పరీక్ష కేంద్రానికి చేర్చి శభాష్ అనిపించుకున్నారు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు హాజరు కావాల్సిన ఓ విద్యార్థిని జనగామ అర్బన్ పోలీసులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేర్చి తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. సునీత అనే ఫస్టియర్ విద్యార్థిని పొరపాటున తను పరీక్ష రాయాల్సిన సెంటర్‌కు బదులు మరొక సెంటర్‌కు వెళ్లింది. ఈ క్రమంలో ప్రెస్టన్ కాలేజీ వద్ద విద్యార్థిని సునీత కంగారు పడుతున్న తీరును గమనించిన సీఐ దామోదర్ రెడ్డి, ఎస్ఐ చెన్నకేశవులు సదరు విద్యార్థినిని సకాలంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీ సెంటర్‌కు పోలీసు వాహనంలో చేర్చారు. పోలీసులు స్పందించిన తీరుపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. కాగా, ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొత్తం మూడు గంటలపాటు పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులను కాస్త ముందుగానే సెంటర్‌లోకి అనుమతిస్తారు. విద్యార్థులు ఉదయం 8:45 గంటలలోపు సెంటర్‌లో ప్రవేశించడం ఉత్తమమని అధికారులు సూచించారు. ఆలస్యంగా వచ్చే వారిని అంటే 9:05 గంటల తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించరు. బుధవారం ఫస్టియర్ విద్యార్థులకు రెండోభాష పేపర్-1కు పరీక్ష నిర్వహిస్తారు. గురువారం సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,532 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫస్టియర్‌లో 4,88,448 విద్యార్థులు, సెకండియర్‌లో 5,08,523 విద్యార్థుల చొప్పున 9,96,971 విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. వీరిలో గతంలో ఫెయిలైన 67,735 మంది విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరుకాబోతున్నారు. పరీక్షల కోసం 29,992 మంది ఇన్విజిలెటర్లు, 72 మంది ఫ్లయింగ్‌స్క్వాడ్, 124 సిట్టింగ్ స్క్వాడ్‌లకు విధులు కేటాయించారు. ఇంటర్‌బోర్డు అబ్జర్వర్లను (పరిశీలకులు) సైతం రంగంలోకి దించనున్నది.



# శిరీష హత్య కేసులో కీలక మలుపు

**ఆడపడుచు హత్య చేసినట్లు నిర్ధారణ.. భర్త వినయ్ సహకరించినట్లు వెల్లడి**

**హైదరాబాద్, మార్చి 5:** నగరంలోని మలక్‌పేటలో జరిగిన వివాహిత శిరీష హత్య కేసు కీలక మలుపు తిరిగింది. శిరీషను ఆమె ఆడపడుచు హత్య చేసినట్లు పోలీసులు నిర్ధరించారు. హత్య విషయం తెలిసినా దాన్ని బయటపెట్టకుండా తన సోదరితో కలిసి శిరీష మృతదేహాన్ని భర్త వినయ్ మాయం చేయాలనుకున్నట్లు పోలీసులు గుర్తించారు. శిరీషకు మత్తుమందు ఇచ్చి, స్పృహ కోల్పోయిన తర్వాత ఊపిరాడకుండా చేసి చంపినట్లు పోలీసులు తేల్చారు. వినయ్, అతడి సోదరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన దంపతులకు ముగ్గురు కుమార్తెలు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే మరణించటంతో చిన్న కూతురు శిరీష (32)ను కరీంనగర్‌కు చెందిన ఓ ప్రొఫెసర్ దత్తత తీసుకున్నారు. 2016లో నాగర్‌కర్నూలు జిల్లా దోమలపెంటకు చెందిన వినయ్‌ను శిరీష ప్రేమ వివాహం చేసుకుంది. ఈ పెళ్లి ఇష్టం లేని ప్రొఫెసర్ కుటుంబం ఆమెను దూరంగా ఉంచారు. దంపతులిద్దరూ మలక్‌పేటలోని జమున టవర్స్‌లో ఉంటున్నారు. ప్రైవేటు ఉద్యోగం చేసిన వినయ్ ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. శిరీష ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. 2019లో పాప జన్మించింది. అనుమానం.. వేధింపులు పెళ్లయిన ఏడాది నుంచే భార్యపై అనుమానంతో వినయ్ నిత్యం గొడవ పడేవాడు. ఈ నెల 2 ఉదయం 10 గంటలకు భార్య సోదరి స్వాతికి... ఫోన్ చేసి, శిరీష ఛాతి నొప్పితో మరణించినట్టు సమాచారమిచ్చాడు. ఈ విషయాన్ని స్వాతి నిజాంపేట్‌లోని మేనమామ మధుకర్‌కు చెప్పింది. ఆయన శిరీష నంబరుకు ఫోన్ చేసి, అట్నుంచి మాట్లాడిన మహిళతో తానొచ్చేంత వరకు మృతదేహాన్ని అక్కడే ఉంచాలని సూచించాడు. అనంతరం పలుమార్లు ఫోన్‌చేసినా స్పందించకపోవటంతో ఆసుపత్రిలో సంప్రదించాడు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో గ్రామానికి తీసుకెళ్తున్నట్లు వారు సమాచారమిచ్చారు. ఆసుపత్రి నుంచి అంబులెన్స్ డ్రైవర్ నంబర్ తీసుకొని ఫోన్ చేసి.. ఆరా తీయటంతో మృతదేహాన్ని నాగర్‌కర్నూలు తరలిస్తున్నట్లు చెప్పాడు. దోమలపెంట సమీపంలో ఉన్నట్టు తెలిపాడు. నగర పోలీసుల సాయంతో అంబులెన్స్ డ్రైవర్, వినయ్‌తో ఫోన్‌లో మాట్లాడించి మృతదేహాన్ని సోమవారం నగరానికి రప్పించారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకి తరలించారు. అనుమానాస్పద మృతిగా చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. శిరీష మెడ చుట్టూ గాయాలను గుర్తించి.. మృతురాలి బంధువులు వినయ్‌ను నిలదీయగా, పొంతన లేని సమాధానాలు చెప్పినట్టు సమాచారం.

## తప్పులను ప్రశ్నించినందుకే

# సస్పెండ్ చేశారు

**బీసీల రాజ్యాధికారం కోసం పోరాటం**

**రేవంత్ ఒత్తిడితోనే సస్పెండ్ చేశారు**

**బెదిరింపులకు భయపడేది లేదు : తీన్మార్‌మల్లన్న**



**హైదరాబాద్, మార్చి 5:** ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నించినందుకే పార్టీ నుంచి నన్ను సస్పెండ్ చేశారని తీన్మార్ మల్లన్న తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... తనను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయించి రేవంత్ రెడ్డి చాలా పెద్ద పొరపాటు చేశారని అన్నారు. బీసీలకు రాజ్యాధికారం ఎందుకు రాదో.. చూస్తామన్నారు. "నన్ను సస్పెండ్ చేస్తే.. బీసీ ఉద్యమం ఆగిపోతుందన్న భ్రమలోంచి రేవంత్ బయటకు రావాలి. నాలాంటి వాళ్ళు పక్కన ఉండొద్దని సీఎం రేవంత్ రెడ్డి కోరుకుంటున్నారు. ఈడబ్ల్యూఎస్ కోటాకు ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతోనే కుల గణనను తప్పుగా చూపారు. 90 ఏళ్ళ తర్వాత కుల గణన చేస్తే.. చపట్లు కొట్టేటోడు కూడా లేదు. కుల గణనపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చకు రెడీ. పీసీసీ అధ్యక్షుడిపై ఒత్తిడి చేసి రేవంత్ రెడ్డికి నన్ను సస్పెండ్ చేయించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తానన్న రాహుల్ గాంధీ హామీతోనే కాంగ్రెస్‌లో చేరాను. తన పక్కన వారు బానిస మాదిరి బతకాలని రేవంత్ కోరుకుంటారు. రేవంత్ చేసిన కులగణన చిత్తు కాగితంతో సమానం. సొంత మంత్రులకే ముఖ్యమంత్రి పేరు గుర్తుకు రావటం లేదు" ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. 2011లో రాహుల్ గాంధీ చేసిన పనినే తాను చేసినట్లు తెలిపారు. మన్మోహన్ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను రాహుల్ గాంధీ చించలేదా?.. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ఒక న్యాయం.. మల్లన్నకు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం అగ్రవర్ణాలకు మాత్రమే అని వెల్లడించారు. ముఖ్యమంత్రి, మంత్రులు.. కులగణనలో నిర్లక్ష్యంగా పాల్గొన్నారని తెలిపారు. అగ్రవర్ణాలను ఎక్కువ చూపి.. బీసీలను తొక్కి పెట్టారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి.. పదే పదే తప్పులు మాట్లాడుతూ దొరికిపోతున్నారని అన్నారు. ప్లాన్ ప్రకారం కాంగ్రెస్‌ను ఖతం చేసే పనిలో సీఎం రేవంత్ ఉన్నారంటూ సంచలన కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్ .. ప్రధాని మోదీ ఒకరికి ఒకరు సహకరించుకుంటున్నారన్నారు. మల్కాజిగిరి, చేవెళ్ళ, మహబూబ్‌నగర్ ఎంపీలను బీజేపీ గెలవటానికి రేవంత్ సహకరించారని ఆరోపించారు. బలమైన కేసీఆర్‌తో తాను కొట్లాడినప్పుడు రేవంత్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ ఎంపీగా వంశీచంద్ రెడ్డిని.. రేవంత్ రెడ్డే ఓడించారన్నారు. మహబూబ్‌నగర్, మల్కాజిగిరి ఎంపీలను గెలిపించుకోలేని రేవంత్ .. తనను గెలిపించారా అంటూ మండిపడ్డారు. రేవంత్ కూర్చున్న సీఎం కుర్చీకి పునాది పడటానికి తాను కారణమని స్పష్టం చేశారు. "నా రెక్కల కష్టంతోని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రావటానికి నా పాత్ర కూడా ఉంది. కేసీఆర్ నియంత పాలనలో కాంగ్రెస్‌కు.. నా న్యూస్ ఆఫీస్ గాంధీ భవన్‌గా మారింది. నేను ప్రచారం చేసిన 45 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ 42 సీట్లు గెలిచింది. రేవంత్‌కు నచ్చకున్నా.. 2028లో బీసీ ముఖ్యమంత్రి ఖాయం. హనుమంతరావు, అంజన్ కుమార్ యాదవ్ లాంటి వాళ్ళకు కాంగ్రెస్‌లో స్వేచ్ఛ లేదు. అధికారంలోకి వచ్చి 15 నెలలు అయినా.. కాంగ్రెస్ కార్యకర్తలు సంతోషంగా లేరు. గౌడ్ కోటాలో జగ్గారెడ్డి సతీమణికి కార్పోరేషన్ పదవి వచ్చింది. రెడ్డిలు పప్పు, బెల్లం లెక్క కార్పొరేషన్ పదవులు పంచుకున్నారు" అంటూ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు చేశారు. అలాగే సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మల్లన్న ప్రెస్‌మీట్‌కు బీసీ జేఏసీ నేతలు మద్దతు తెలిపారు.

# 15 నెలల్లోనే రూ. 1.65 లక్షల కోట్ల అప్పు

**నాడు అప్పులు చేసి ప్రజల కష్టాలు తీర్చితే..**

**నేడు అప్పులు చేసి జేబులు నింపుకుంటున్న సీఎం రేవంత్**



**హైదరాబాద్, మార్చి 5:** నాడు బీఆర్ఎస్ చేసిన అప్పులపై ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ.. నేడు 15 నెలలకాలంలోనే రూ. 1.65 లక్షల కోట్లు అప్పులు చేశారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. నాడు అప్పు చేసి 70 లక్షల అన్నదాతలకు అండగా నిలిచి వారికి రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు ఖాతాల్లోకి వేసి.. రూ.28 వేల కోట్లు రుణమాఫీ చేసి.. రూ.6 వేల కోట్లతో రైతుబీమా చేసి.. లక్ష 11 వేల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందేలా చేసి.. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు.. పారిశ్రామిక, గృహావసరాలకు 24 కరెంటు అందించి.. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, సీతారామసాగర్ కట్టి 45 వేల చెరువులు కుంటలు బాగుచేసి.. 45 లక్షల మందికి పైగా ఆసరా ఫించన్లతో అండగా నిలిచి.. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, కళ్యాణలక్ష్మి, వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు, 30 మెడికల్, నర్సింగ్ కాలేజీలను ఏర్పాటుచేస్తే అప్పులు తప్పని రాద్ధాంతం చేశారని విమర్శించారు. 15 నెలల పాలనలో రూ.1.65 లక్షల కోట్లు అప్పు చేసి.. రుణమాఫీ ఎగ్గొట్టి.. రైతుబంధు ఎగ్గొట్టి.. రైతుబీమా లేకుండా చేసి.. కరెంటుకు కోతలు వేసి.. గురుకులాలను గాలికి వదిలేసి.. కాళేశ్వరాన్ని ఎండబెట్టి.. పాలమూరు రంగారెడ్డిని పడావుపెట్టి.. శ్రీశైలం సొరంగం కుప్పకూల్చి 8మంది ప్రాణాలు బలితీసుకున్న బాధ్యతలేని ప్రభుత్వం ఇది అని కాంగ్రెస్‌పై కేటీఆర్ మండిపడ్డారు. తట్టెడు మట్టి తీసింది లేదు.. ఒక్క పథకం అమలు చేసింది లేదు.. గల్లీలో గాలిమాటలు, ఢిల్లీకి ధనం మూటలు మోసుడు తప్ప.. 15 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏంటి అని నిలదీశారు. నాడు అప్పులు తప్పని అడ్డగోలు అభాండాలు.. నేడు అందినకాడికి అప్పులు అని విమర్శించారు.

## 1971 జనాభా లెక్కల ఆధారంగా

# డీలిమిటేషన్

**తమిళనాడు అఖిలపక్ష భేటీ తీర్మానం**

**చెన్నై, మార్చి 5:** 1971 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ పక్రియ చేపట్టాలని, రాబోయే 30 ఏళ్లపాటు అదే అమల్లో ఉండాలనితమిళనాడు సిఎం స్టాలిన్ స్పష్టం చేశారు.తమిళనాడులో డీలిమిటేషన్ అంశంపై అఖిలపక్ష సమావేశం కీలక తీర్మానాలను ఆమోదించింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేపట్టారు. అఖిలపక్ష సమావేశంలో ప్రస్తుత లోక్‌సభలో ఉన్న 543 సీట్లనే కొనసాగించాలని తీర్మానించారు. దక్షిణాది రాష్ట్రాలు డీలిమిటేషన్ వల్ల నష్టపోకుండా ఉండాలని, ఇతర దక్షిణాది రాష్ట్రాలతో కలిసి కేంద్రానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న డీలిమిటేషన్ పక్రియపై గత కొంతకాలంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాదికి తీవ్ర నష్టం కలుగుతుందని అభిప్రాయపడ్డాయి. అయితే, బీజేపీ ఈ డీలిమిటేషన్ వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని వాదిస్తోంది. అయితే, డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాలు నష్టపోకుండా ప్రధాని నరేంద్ర మోడీ లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని స్టాలిన్ కోరారు. గత 50 ఏళ్లుగా కుటుంబ నియంత్రణను పక్కాగా అమలు చేసిన తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలకు ఈ నిర్ణయం శిక్షగా మారకూడదని స్టాలిన్ స్పష్టం చేశారు. ఈ తీర్మానాన్ని ప్రధాని మోడీకి పంపడమే కాకుండా, ప్రజల్లో చైతన్యం కలిగించే చర్యలు చేపట్టనున్నట్లు స్టాలిన్ ప్రకటించారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఎంపీలతో సంయుక్త కమిటీని ఏర్పాటు చేసి కేంద్రానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తెలిపారు. ఈ డీలిమిటేషన్ అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లకుండా కేంద్రంతో పోరాటానికి దక్షిణాది నాయకులు సమాయత్త మవుతున్నారు. మొత్తం మీద ఈ డీలిమిటేషన్ అంశం దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం మధ్య తీవ్ర రాజకీయం రేపే అవకాశాలున్నాయి.

మానేరు జనత
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక




# బీజేపీ పునర్విభజన రాజకీయం!

దక్షిణాదిలో బీజేపీ పెద్దగా పట్టు సాధించలేకపోతోంది. తమిళనాడు, కేరళలో అడుగు పెట్టడమే కష్టంగా ఉంది. గత దశాబ్దంగా ఎంతగా ప్రయత్నించినా ఒక్కసీటు సాధించడం కష్టంగా మారుతోంది. ఈ క్రమంలోలోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త ఆందోళనలకు దారితీస్తున్నది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. అయితే అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరిగే బదులు తగ్గుతాయన్న ఆందోళన ఇప్పుడు దక్షిణాది నేతల్లో కలవరానికి గురి చేస్తోంది. 2011 జనాభా లెక్కలు తీసుకుంటే, అప్పటికీ ఇప్పటికీ దక్షిణాదిలో జనాభా తగ్గింది. ఈ లెక్కన సీట్లు పెరగాల్సింది పోయి తగ్గే ప్రమాదం ఉంది. ఇదే విషయమై ప్రధానంగా తమిళనాడు సిఎం స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పిల్లలను కనాలని నవదంపతులకు పిలుపునివ్వడం కూడా జరిగింది. రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఈ పునర్విభజన రాజకీయ విభజనగా మారడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజ్యాంగంలోని 82వ అధికరణం ప్రకారం ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలు జరిపించాలి. మార్పులు చేర్పులను బట్టి చట్టసభల నియోజకవర్గాల సంఖ్యలు, హద్దులు సవరణలు చేయాల్సి వుంటుంది. ఎందుకంటే జనాభా అధికంగా వున్నా తక్కువగా ఉన్నా అన్ని రాష్ట్రాల్లోనూ ఓటుకు ఒకే విలువ వుండాలి. ఎమర్జన్సీలో తెచ్చిన 42వ రాజ్యాంగ సవరణలో నియోజకవర్గాల పునర్విభజన స్తంభింపచేశారు. ఆ సమయంలోనే జనాభా నియంత్రణపై ప్రత్యేక కేంద్రీకరణ పెట్టారు. జనాభాను తగ్గించే చర్యల కోసం రాష్ట్రాలను ప్రోత్సహించారు. అప్పటికి దక్షిణాది రాష్ట్రల్లో 6 నుంచి 10 శాతం పెరుగుదల వుంటే ఉత్తరాదిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, యు.పి, బీహార్‌లలో 12 నుంచి 15 శాతం ఉంది. కనుక జనాభా నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలనీ ఇరవ-య్యేళ్ల తర్వాతనే పునర్విభజన చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమయంలో జనాభా తగ్గితే సీట్లు తగ్గించడం సరికాదు గనక పార్లమెంటు స్థానాల సంఖ్యను 2001 వరకూ స్తంభింపచేశారు. అందువల్ల సీట్ల స్వరూపంలో అనేక మార్పులు జరిగినా మొత్తం ఎంపిల సంఖ్యలో మార్పు రాలేదు. సరిహద్దుల మార్పు తప్ప ఆ యా రాష్ట్రాల వారీగా వున్న సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను 2026 వరకూ వాయిదా వేస్తూ 2002 రాజ్యాంగ సవరణ చట్టం తీసుకొచ్చారు. దీంతో ఇప్పటి వరు ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఇప్పుడు జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంది. ఈ సమయంలో గందరగోళం చెలరేగుతోంది. ఉన్నసీట్లు తగ్గిస్తే తమకు పార్లమెంటులో పట్టు లేకుండా పోతోందన్న ఆందోళన మొదలయ్యింది. నిజానికి ఇదో కీలకమైన అంశం. విధాన నిర్ణయం కూడా. ఇలాంటి కీలకాంశాలపై పారదర్శకంగా సమగ్రంగా చర్చ జరగాలి. దక్షిణాది నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్న వేళ కేంద్రం మాత్ర స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. ఏకపక్ష నిర్ణయాలు లేకుండా చూడడం కేంద్ర ప్రభుత్వ విద్యుక్త ధర్మం. ఎలాగూ దక్షిణాదితో వచ్చే లాభం లేదు కనుక సీట్లు తగ్గిస్తేనే మంచిదన్న కుత్సిత ఆలోచన ఏదైనా ఉందా అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి. అధ్యక్ష తరహాను తలపించే విధంగా కేంద్రీకృత పెత్తనానికి బిజెపి యత్నిస్తోందని అనేక ఆరోపణలు సైతం ఉన్నాయి. అదే సమయంలో అంతా రాజ్యాంగబద్ధంగా పద్ధతి ప్రకారమే జరగడానికి చర్యలు అవసరం. నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త సవాళ్లకు దారితీస్తున్నది. రాజ్యాంగం ప్రకారం జనాభా లెక్కల తర్వాత జరగాల్సిన పునర్విభజన అనేక కారణాల వల్ల సందేహాస్పదమై పోయింది. దక్షిణాది రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గిపోతుందనీ, ఒకవేళ పెంచినా వాటి వాటాగా రావలసిన పెరుగుదల రాదనీ స్టాలిన్ విమర్శ చేస్తున్నారు. అయితే హోం మంత్రి అమిత్ షా ఎవరి సీట్లూ తగ్గబోవని ప్రకటించారు. అసలు పునర్విభజన ఏ ప్రాతిపదికపై జరుగుతుందో చెప్పాలని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి గట్టిగా కోరుతున్నారు. దక్షిణాదిపై బిజెపి, కేంద్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా అమిత్ షా హామీలను నమ్మలేమని వ్యాఖ్యానించారు. దక్షిణాది రాష్ట్రాల నోరు నొక్కేందుకు పునర్విభజన అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రానికి నిజంగా చిత్తశుద్ధి వుంటే ఈ పునర్విభజన ఏ ప్రాతిపదికన జరుగుతుంది, ఇప్పుడున్న సీట్లు ప్రస్తుత జనాభా ప్రకారమే వుంటాయా అని ఆయన ప్రశ్నించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ కూడా కేంద్రం అందరితో చర్చించి అడుగు వేయాలనీ, సందేహాలు తొలగించాలని వ్యాఖ్యానిం చారు. అయితే జమిలి ఎన్నికల బిల్లుతో ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సిద్దం అవుతున్న వేళ ఈ ఆందోళనపై స్పష్టత రావాల్సి ఉంది. 1976 తర్వాత కాలంలో దక్షిణాది రాష్టాలైన్ర కేరళ, తమిళనాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తర్వాత ఎ.పి, తెలంగాణలు జనాభా తగ్గింపులో గణనీయమైన ప్రగతిని సాధించాయి. తమిళనాడులో సంతానోత్పత్తి రేటు 2001 నాటికే 2.0గా వుంది. అంటే జనాభా స్థిరీకరణ దశకు చేరింద ని అంచనా వేశారు. అమిత్ షా ప్రకటనను బట్టి చూస్తే 2026లో ఈ ప్రక్రియ చేపట్టడం తథ్యంగా కనిపిస్తుంది. అయితే ఇప్పుడు కేవలం జనాభాను బట్టి సీట్లు నిర్ణయించేట్టయితే తక్కువ జనాభా వున్న దక్షిణాదిన సీట్లు తగ్గితే ఇప్పటికే చాలా ఎక్కువగా వున్న యు.పి, బీహార్ వంటి వాటికి ఇంకా పెరుగుతాయి. సగటు జనాభాను చూస్తే వేరే తేడాలుంటాయి. ఉదాహరణకు నాలుగు కోట్ల జనాభా వున్న తెలంగాణకు 17 లోక్‌సభ సీట్లున్నాయి. 12.6 కోట్ల జనాభా వున్న బీహార్‌కు 40 సీట్లున్నాయి. సగటున తెలంగాణకు 23 లక్షల మందికి ఒక సీటు వుంటే బీహార్‌లో సగటున 32 లక్షల మందికి ఒక సీటు వున్నట్టు లెక్క. అందులోనూ జనాభాను బట్టి దామాషా ప్రాతిపదికన పెంచేట్టయితే ఆ ఫార్ములాను బట్టి ఈ తేడా ఇంకా విపరీతంగా మారొచ్చు. సాంకేతికంగానేగాక రాజకీయంగానూ ఈ మార్పులకు చాలా ప్రభావం వుంటుంది. బిజెపి ఎన్నిఎత్తులు వేసినా దక్షిణాదిన స్వంతంగా అధికారంలోకి వచ్చేంతగా బలం పెంచుకోవడంలో సఫలం కాలేకపోయింది. కర్ణాటక మినహా ఇతర చోట్ల ప్రత్యక్ష, పరోక్ష మిత్రులపైనే ఆధారపడి వుంటున్నది. ఇలాంటి సమయంలో పునర్విభజన పేరిట ఉత్తరాదిన సీట్లు పెంచి దక్షిణాదిన తగ్గించేలా రాజకీయ ఎజెండాతో ముందుకు పోతుందా అన్న అనుమానాలు వస్తున్నాయి.

# తమిళనాట హిందీ పేర్లు తొలగించండి

## ఎక్స్ వేదికగా సీఎం స్టాలిన్ వ్యాఖ్యలు

**చెన్నై, మార్చి 5:** కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యా విధానం అమలు విషయంలో నెలకొన్న వివాదం కొనసాగుతూనే ఉంది. త్రిభాషా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. తమిళనాడులోని అన్ని కేంద్ర కార్యాలయాల నుంచి హిందీని తొలగించాలన్నారు. తమిళంపై ప్రేమ ఉంటే.. చేతల్లో చూపించాలన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ప్రధాని నరేంద్ర మోదీకి తమిళం అంటే అపారమైన ప్రేమ అని భాజపా చెబుతోంది. అదే నిజమైతే.. దాన్ని ఆయన చేతల్లో ఎందుకు చూపించడం లేదు..?. పార్లమెంటులో సెంగోల్‌ను ఏర్పాటుచేయడం కంటే.. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి హిందీని తొలగిస్తే బాగుంటుంది. హిందీకి బదులుగా తమిళాన్ని అధికార భాషగా చేసి.. మరిన్ని నిధులు కేటాయించండి. కేంద్ర బ్జడెట్‌లో తిరుక్కురల్‌ను ఉటంకిస్తే సరిపోదు. రాష్ట్రానికి



ప్రత్యేక పథకాలు, సత్వర విపత్తు సహాయ నిధి, కొత్త రైల్వే ప్రాజెక్టులను అందించాలి. రైళ్లకు అంత్యోదయ, తేజస్, వందేభారత్ వంటి పేర్లు పెట్టడం ఆపండి. దానికి బదులు తమిళ పేర్లను పెట్టండి. తమిళ భాషపై ప్రేమను మాటల్లో కాకుండా.. చేతల్లో చూపించండి' అని స్టాలిన్ పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. 1971 జనాభాల లెక్కల ఆధారంగానే విభజన పక్రియ చేపట్టాలని ప్రధాని మోదీని స్టాలిన్ అభ్యర్థించారు. ప్రస్తుత జనాభా ప్రకారం.. పార్లమెంటులో తాము 12 సీట్లు కోల్పోయి.. 10 సీట్లు మాత్రమే వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తమిళ రాజకీయాలపై ప్రత్యక్షంగా దాడి చేయడమేనన్నారు. ఈ చర్య రాష్ట్ర గొంతును నొక్కేస్తుందన్నారు. తాము విభజనకు వ్యతిరేకం కాదని.. కానీ, గత 50 ఏళ్లుగా సామాజిక, ఆర్థిక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన తమకు ఇది శిక్ష కాకూడదన్నారు. ఈ సందర్భంగా 2026 జనాభా లెక్కల ఆధారంగా విభజన పక్రియ చేపట్టరాదని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది.

# జనాభా పెరుగుదలతో యూపీ, బీహార్‌కు లబ్ధి

## పార్లమెంట్ సీట్లు పెరిగితే బీజేపీకే లాభం

న్యూఢిల్లీ, మార్చి 5: పునర్విభజన జనాభా మేరకు జరిపితే ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెరిగి, దక్షిణిదిలో తగ్గుతాయి. ముఖ్యంగా జనాభాకు తగినట్టు సీట్లు పెంచాలంటే బీహార్, యూపీ వంటి చోట్ల సంఖ్య రెట్టింపవుతుంది. ఈ పెంపు అన్నది జనాభా పెరుగుదలకు కృషి చేసినందుకు బహుమానంగా భావించాల్సి ఉంటుంది. అయితే దక్షిణాదిలో సీట్లు తగ్గవని అమిత్ షా హామీ ఇస్తున్నా.. నమ్మిక కుదరడం లేదు. ఎందుకంటే బిజెపి ఏది అనుకుంటే అది చేసి తీరుతుంది. ఒక లెక్క ప్రకారం ఉత్తరాది రాష్ట్రాలకు 32 స్థానాలు పెరిగితే దక్షిణాదిన 24 తగ్గుతాయి. కేరళకు 20లో ఆరు నుంచి ఎనిమిది కోల్పోవలసి రావచ్చంటున్నారు. అదే ఉత్తరప్రదేశ్‌కు 80 నుంచి 91కి చేరతాయి. బీహార్‌కు పది పెరగ్గా ఎం.పి, రాజస్థాన్‌కు కూడా గణనీయమైన పెరుగుదల వుంటుంది. 1977లో సగటున ఒక్కో ఎంపీ 10.11 లక్షల ఓటర్లకు ప్రాతినిధ్యం వహించేవారు. సగటు ఓటర్ల సంఖ్య నియోజకవర్గానికి ఎంత వుండాలనేదానిపై నిషేధమేమీ లేదు. ఉదాహరణకు ఇప్పుడు కూడా అదే తరహాలో 10.11 లక్షల మందికి ఒకరి చొప్పున నిర్ణయించేట్టయితే ప్రస్తుత జనాభా ప్రకారం 1400 మంది లోక్‌సభ సభ్యులవుతారు. ఆ ప్రకారం యు.పి, బీహార్‌ల సభ్యుల సంఖ్య మూడంతలు పెరుగుతుంది. తమిళనాడు, కేరళ వంటివి రెండింతలే పెరుగుతాయి. అదే బీహార్, యు.పి లను తీసుకుంటే 2015లో కూడా వాటి జనాభా పెరుగుదల రేటు 4.0గా వుంది. మానవాభివృద్ధి సూచికల్లోనూ దక్షిణాది రాష్ట్రాలు కొంత మెరుగ్గా వున్నాయి. హిందీ రాష్ట్రాలు ముఖ్యంగా పెద్దవైన ఉత్తర ప్రదేశ్, బీహార్‌ల జనాభా మాత్రం తగ్గకపోగా పెరుగుతూనే వచ్చింది. జనాభా నియంత్రణ చర్యలలో నిర్లక్ష్యం, మత సంబంధాలతో సహా అనేక రాజకీయ కారణాలు దీని వెనక







వున్నాయనేది స్పష్టం. ఉన్న చట్టం ప్రకారం ఇప్పుడు నియోజక వర్గాల పునర్విభజన ఎజెండాలోకి రానుంది. అంటే ఇక్కడ ఒకటి పెరిగితే అక్కడ నాలుగు పెరుగుతాయి. ఏమైనా ఎంత జనాభా వుంటే ఒక లోక్‌సభ స్థానం, సాంకేతికంగా సమాన ప్రాతినిధ్య సూత్రమేమిటి అన్నదాన్ని బట్టి ఈ అంశాన్ని నిర్ధారించవలసి వుంటుంది.ఎ.పి, తెలంగాణ విభజన తర్వాత తమిళనాడుకే దక్షిణాదిన అత్యధికంగా 39 స్థానాలున్నాయి. దేశ వ్యాపితంగా చూస్తే అది అయిదో స్థానంలో వుంది. ఏకపక్షంగా పునర్విభజన జరిపితే 7,8 స్థానాలు తగ్గిపోతాయి. 11 వరకూ తగ్గొచ్చని మరో లెక్క కూడా వుంది. కొత్త పార్లమెంటులో 888 మంది సభ్యులకు చోటు కల్పించారు. కనుక పాత నిష్పత్తి ఫార్ములా చెల్లుబాటు కాదు. ఇదేగాక మరో సమస్య కూడా వుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించినప్పుడు వారికి రిజర్వు చేసిన మూడో వంతు స్థానాలను అదనంగా కలపాలని తీర్మానించారు. కనుక ఈ రెండు కోణాల్లోనూ సీట్ల సంఖ్య పెంచడమనేది కూడా కీలకాంశంగా వుంటుంది. దీనికి సహేతుకమైన పరిష్కారం కావాలంటే జనాభా దామాషాతో పాటు ఇతర ప్రోత్సాహక సూచికలు కూడా నిర్ణయించాలి. జనాభా ఎక్కువగా వుండటానికి చారిత్రిక కారణాలున్నాయి గనక ఆ ప్రాతిపదికన ఉత్తరాదికి తగ్గించడం సరికాదని ఆ పార్టీని బలపర్చేవారు వాదిస్తున్నారు. ఉత్తరాది నుంచి శ్రామికులు వచ్చి చౌకగా పనిచేయడం వల్లనే తమిళనాడు సంపద పెరిగిందని కూడా వారు వితండ వాదన చేస్తున్నారు. ఇప్పటికే స్వంత మెజార్టీ కోల్పోయిన బిజెపి రేపు మరింత తగ్గిపోకుండా ఉత్తరాది రాజకీయం నడుపుతున్నదా అని రాజకీయ పరిశీలకులు సందేహిస్తున్నారు. భారతదేశ సమైక్యత, సమతుల్యతను కాపాడుకోవడం రాష్ట్రాల హక్కులను సమాఖ్య రాజ్యాంగానుసారం కాపాడటం ఇందులో దాగి వున్నాయి. సీట్లు పైనే పెంచి దక్షిణాదికి గొర్రె తోకగా వుంచేట్టయితే అప్పుడు సమైక్యతా భావనకే విఘాతం కలుగుతుంది. విధాన నిర్ణయాలలోనూ సమతుల్యత దెబ్బ తింటుంది. ఇంకా మహిళల రిజర్వేషన్ కోసం సీట్ల పెంపు, లేదంటే జనాభా ప్రకారం పెంపు వంటి చర్యలు చేపడితే మరింత పకడ్బందీగా అడుగులు వేయవలసి వుంటుంది. దేశమంతటా ఒక ప్రధాన చర్చగా మారిన ఈ అంశంపై కేంద్రం విజ్ఞతతో నిర్ణయం తీసుకుని దేశ సమైక్యతను సమాఖ్య సూత్రాలనూ కాపాడవలసి వుంటుంది. లేకపోతే ఇది పెద్ద పోరాటంగా మారడం అనివార్యమే అవుతుంది.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు షాక్

- రెండు స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీ
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా అంజిరెడ్డి గెలుపు
- సత్తాచాటి కాంగ్రెస్‌కు సవాల్ విసిరిన బీజేపీ





**కరీంనగర్, మార్చి 5 :** తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. అనూహ్యంగా బిజెపి రెండు ఎమ్మెల్సీలు గెలచుకుని సవాల్ విసిరింది. ఇప్పటికే టీచర్ ఎమ్మెల్సీ గెల్చుకున్న బిజెపి, కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీని కూడా తన ఖాతాలో వేసుకుంది. గ్రాడ్యుయేట్ ఎన్నికల ఫలితాలపై ఎట్టకేలకు ఉత్కంఠ వీడింది. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో అంజిరెడ్డి విజయం ఖరారైంది. అంజిరెడ్డికి 78,635 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి 73,644 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 63,404 ఓట్లు పడ్డాయి. అంజిరెడ్డి విజయం ఖరారు కావడంతో కౌంటింగ్ హాలు నుంచి నరేందర్ రెడ్డి వెళ్లిపోయారు. కాగా, కరీంనగర్ టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలు బీజేపీ వశం అయ్యాయి. మరోవైపు అంజిరెడ్డి విజయంపై ఎన్నికల అధికారులు అధికారిక ప్రకటన చేయనున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్య పోరు నువ్వా, నేనా? అన్నట్లు సాగింది. రెండ్రోజులుగా సాగుతున్న కౌంటింగ్ ఉత్కంఠకు బుధవారం తెరపడడంతో విజేత ఎవరనేది తేలిపోయింది. కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకున్న బీజేపీ.. ఇదే జిల్లాలకు చెందిన పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్నీ సొంతం చేసుకుంది. అయితే ఓట్ల లెక్కింపు రెండ్రోజులుగా ఎంతో ఉత్కంఠను రేకెత్తించింది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో ఫలితం తేలకపోవడంతో రెండో రౌండ్ ప్రాధాన్యత ఓట్లు లెక్కించారు. మంగళవారం రాత్రి 12 గంటల వరకూ ఆరు రౌండ్లు లెక్కించగా.. బీజేపీ అభ్యర్థి సి.అంజిరెడ్డి ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి కన్నా 6,931 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. వరసగా ఐదు రౌండ్లు ఆధిక్యం కనబరిచిన బీజేపీ.. 6, 7వ రౌండ్లలో మాత్రం వెనకబడింది. ఆరో రౌండ్‌లో నరేందర్‌రెడ్డి 211 ఓట్ల స్వల్ప ఆధిక్యం సాధించారు. ఏడో రౌండ్‌లో నరేందర్‌రెడ్డికి 600 పైచిలుకు ఓట్ల ఆధిక్యం లభించింది. అయితే చివరగా బుధవారం సాగిన ఓట్ల లెక్కింపులో అదృష్టం బీజేపీ అభ్యర్థిని వరించింది. దీంతో మొదట్నుంచీ గెలుపుపై ధీమాగా ఉన్న కాంగ్రెస్ నేతలపై ఒక్కసారిగా పిడుగుపడినట్లు అయ్యింది. ఈ విజయంతో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియం వద్ద బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. విజేతలకు కేంద్రమంత్రి బండి సంజయ్, నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలు అభినందనలు తెలిపారు.

## సింగాపురం కిట్స్ లో.. ఈనెల 21, 22 న "కిట్సోజెన్ - 2025"



**హుజురాబాద్, మార్చి 5 జనతా న్యూస్:** హుజురాబాద్ మండలం సింగాపురంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 21 22 తేదీల్లో కిట్సొజెన్ పేరిట విద్యార్థుల ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ కె శంకర్ తెలిపారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో కిట్సోజెన్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరై వారి ప్రతిభ పాటవాలను ప్రదర్శించనున్నారని వెల్లడించారు. ప్రతి రెండేళ్లకోసారి ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, క్రీడా పోటీలతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, అకాడమిక్ కు సంబంధించిన పేపర్ ప్రజెంటేషన్, సెమినార్లు, రోబోటిక్స్ వంటి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి ఇందులో ఏదైనా ఒక కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి ప్రతినిధులు, కార్యక్రమం కోఆర్డినేటర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన



జనత న్యూస్ బెజ్జంకి : ఎస్సీ వర్గీకరణ సెమీమ్ అక్తర్ నివేదిక లో లోపాలను సవరణ చేసి, రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో మాదిగ డప్పు కళాకారుల చేత పురవీధులలో డప్పుల ప్రదర్శన నిర్వహించినట్లు ఎమ్మార్పీఎస్ బెజ్జంకి మండల అధ్యక్షులు వడ్లూరు పరుశరాములు బుధవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను సవరిస్తూ మంత్రివర్గ విస్తరణలో జనాభా ప్రకారం ఇద్దరు మాదిగ ఎమ్మెల్యేలకు మంత్రులుగా అవకాశం ఇవ్వాలని, వర్గీకరణ 3 గ్రూపులు కాకుండా, 4 గ్రూపులుగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీ ఈ డప్పుల ప్రదర్శనల ద్వారా తమ ఆకాంక్ష తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి చింతకింది పరశురాములు, మరియు వివిధ గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## గల్ఫ్ మృతుడి పార్థివ దేహం కోసం కేంద్రమంత్రికి వినతి

### మృతుడి కుటుంబాన్ని ఓదార్చిన గల్ఫ్ కార్మిక సేవ సమితి నాయకులు.





జనత న్యూస్ బెజ్జంకి ( గన్నేరువరం ): గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు గత్తర ( లింగంపల్లి) మొండయ్య గత 18 సంవత్సరాల నుండి సౌదీ అరేబియా దేశంలో రియాజ్ ప్రాంతంలో కార్మికుడిగా పని చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు, అయితే గత కొన్ని రోజుల నుండి ఆరోగ్యం బాగాలేక పోవడంతో అక్కడే రియాజ్ లోని హాస్పటల్లో చికిత్స పొందుతూ, మరణించినట్లు తన స్నేహితులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో, కుటుంబ సభ్యులతో పాటు , గ్రామ ప్రజలు శోకసముద్రంలో మునిగిపోయారు. మృతుడి పార్టీవ దేహం ఇండియాకు తెప్పించాలని మృతుని కుమారుడు బుధవారం గునుకుల కొండాపూర్ మాజీ సర్పంచ్ అజయ్ వర్మతో కలిసి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి వినతి పత్రం సమర్పించారు.

**మృతుడి కుటుంబాన్ని ఓదార్చిన జి. డబ్ల్యూ. ఏ. సి, నాయకులు**

జనతా న్యూస్ గన్నవరం : మండలంలోని గునుకుల కొండాపూర్ వాసి గత్తర ముండయ్య, గల్ఫ్ లో మరణించాడు అన్న వార్త తెలియగానే గల్ఫ్ కార్మిక నాయకులతో కలిసి సిద్దిపేట జిల్లా గల్ఫ్ సేవా సమితి అధ్యక్షులు బుర్ర తిరుపతి గౌడ్ బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహం ఇండియాకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో కొరిమి కొమరయ్య, ఎలా పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ "ఛాంపియన్ ట్రోఫీ" బీజేపీదే

**ఒక వర్గానికి కొమ్ము కాస్తున్న కాంగ్రెస్ కు గుణపాఠమిది**

**హిందూ సమాజమంతా కాంగ్రెస్ కు ఇచ్చిన "రంజాన్" గిఫ్ట్ ఈ తీర్పు**

**బీజేపీ కార్యకర్తల పోరాటాలకు హ్యాట్సాఫ్....**

**ఓటరు మహాశయులకు శిరస్సు వంచి వందనాలు**

**డబ్బులు పంచి గెలవాలని కాంగ్రెస్ చెంప చెళ్లుమన్పించారు**

**నోట్లు పంచినోళ్ల గూగుల్ పే లెక్కలన్నీ తీస్తాం....ఎవరినీ వదిలిపెట్టబోం**

**కాంగ్రెస్ పై యుద్ద భేరీ మోగిస్తున్నాం**

**దమ్ముంటే తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించండి**

**ఇకపై ఏ ఎన్నికలు జరిగినా గెలపు బీజేపీదే**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్....**

**గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపుతో అంబురాన్నంటిన సంబురాలు**

**కార్యకర్తలతో కలిసి సంబురాలు చేసుకున్న సంజయ్**







కరీంనగర్ : తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల "ఛాంపియన్ ట్రోఫీ"లో బీజేపీ విజయం సాధించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఒక వర్గానికి కొమ్ము కాస్తున్న కాంగ్రెస్ కు ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పు గుణపాఠమన్నారు. ముస్లింలంతా ఏకమై బీజేపీని ఓడించాలని చూస్తే హిందూ సమాజమంతా కాంగ్రెస్ ను ఓడించి ఆ పార్టీకి "రంజాన్" గిఫ్ట్ ఇచ్చారని పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తల పోరాటాలకు హ్యాట్సాఫ్ చెప్పిన బండి సంజయ్ బీజేపీకి అండగా నిలిచిన ఓటరు మహాశయులకు శిరస్సు వంచి వందనాలు తెలిపారు. డబ్బులు పంచి గెలవాలని కాంగ్రెస్ అభ్యర్థి చెంప చెళుమన్పించారని చెప్పారు. నోట్లు పంచిన వారిని వదిలిపెట్టబోమని, గూగుల్ పే వివరాల లెక్కలు తీస్తున్నామని తెలిపారు.

కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్ రావు తదితరులతో కలిసి బండి సంజయ్ "విక్టరీ" గుర్తును చూపిస్తూ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బండి సంజయ్ ఏమన్నారంటే.... బీజేపీ విజయానికి అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలందరికీ హ్యాట్సాఫ్. టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించిన ఓటర్లకు శిరస్సు వంచి వందనాలు చెబుతున్నా. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇది నాలుగో విజయం. 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలతోపాటు నిన్న టీచర్స్ ఎమ్మెల్సీ, ఇయాళ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీటు సాధించాం. న రేంద్రమోదీ నీతి, నిజాయితీ పాలనను, తెలంగాణకు కేంద్రం కేటాయించిన నిధులను గుర్తించడంతోపాటు కార్యకర్తలు చేసిన పోరాటాలును గుర్తు చేసుకుని అద్భుతమైన విజయాన్ని అందించినందుకు చాలా సంతోషంగా ఉంది. మా కార్యకర్తలు టీచర్లు, నిరుద్యోగులు, ప్రజల పక్షాన చేసిన పోరాటాలను గుర్తు చేశాం. లాఠీదెబ్బలను, జైలుకు వెళ్లిన సంఘటలను గుర్తు చేసినం. మోదీ ప్రభుత్వం ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను రాయితీ ఇవ్వడంతోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసింది. అవన్నీ గుర్తు చేసినం. మా పక్షాన నిలబడ్డందుకు అనందంగా ఉంది. మొన్న ఛాంపియన్ ట్రోఫిలో ఇండియా గెలిచింది. ఆరోజు, ఈరోజు అదే చెప్పిన. మాది ఇండియా టీం. విజయం సాధించి తీరుతామని చెప్పినం. వాళ్లు డబ్బు సంచులు పంచారు. మేం ఓటర్లను నమ్ముకున్నాం. నోట్ల సంచులు ఓడిపోయాయి. ఓటర్లే గెలిచారు. ఈవీఎంలను మేనేజ్ చేసి బీజేపీ గెలుస్తుందని పదేపదే దుష్ప్రచారం చేసిన రాహుల్ గాంధీకి నేను సవాల్ విసురుతున్నా... ఈవీఎంల ద్వారా మాత్రమే కాదు... ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిర్వహించిన బ్యాలెట్ పేపర్ ద్వారా కూడా బీజేపీయే గెలిచింది. దీనికేం సమాధానం చెబుతారు. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేసినా, డబ్బు సంచులను పంచినా ఓటుకు రూ.5 వేల చొప్పున పంచినా వారి కుట్రలు ఫలించలేదు. మేం నయాపైసా ఖర్చు చేయలేదు. మా కార్యకర్తలే ఇంటింటికీ తిరిగారు. వారి కష్టం, మోదీ పాలన, అమ్మవారి దయవల్లే ఈరోజే మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ చెంప చెళ్లుమన్పించారు.

వాస్తవానికి బీఎస్పీ అభ్యర్థి 2వ స్థానానికి వస్తారని భావించాం. ఎప్పుడైతే బీఆర్ఎస్ పార్టీ నేతలు ఆయనకు మద్దతిచ్చి, పైసలిచ్చిందో... అవన్నీ గమనించిన ప్రజలు ఆ అభ్యర్థిని 3వ స్థానానికి పరిమితం చేశారు. మార్పు కోరుతున్న ప్రజలకు బీజేపీ దిక్సూచిలా కన్పించింది. ఇకపై ఏ ఎన్నికలు జరిగినా విజయపరంపర బీజేపీదే. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ గెలపు బీజేపీదే. ఎందుకంటే రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులిస్తోంది కేంద్ర ప్రభుత్వమే. సొమ్ము కేంద్రానిదైతే.. సోకు రాష్ట్ర ప్రభుత్వం చేసుకుంటోంది. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధమైనరు. మా పోరాటాలు, జైళ్లు, తిన్న లాఠీదెబ్బలను గుర్తు చేసుకున్నరు. మా కార్యకర్తల తలలు పగిలి రక్తం చిందించిన సంఘటనలను, త్యాగాలను గుర్తు చేసుకుని ఓటరు మహాశయులు ఓటేసి ఆశీర్వదించారు. వారి నమ్మకాన్ని నిలబెడతాం. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ యుద్దం చేసేందుకు సిద్ధమవుతున్నం. ఇకనైనా కాంగ్రెస్ దిగిరావాలి. రాష్ట్రంలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్లు రాష్ట్ర ప్రభుత్వ పాలనపై వ్యతిరేకత వ్యక్తం చేస్తూ తీర్పు ఇచ్చారు. వెంటనే 6 గ్యారంటీలను అమలు చేయాలి. అట్లాగే 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తి చేయాలి. ఇచ్చిన మాట మేరకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలి. అట్లాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీని అమలు చేయాలి. 5 పెండింగ్ డీఏలు, రిటైర్డ్ మెంట్ బెన్ ఫిట్స్, జీపీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలి. వీరితోపాటు రైతులకు, మహిళలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి.

**డబ్బుల పంపిణీపై అడిగిన ప్రశ్నకు....**

బీజేపీ ఎక్కడైనా పైసలు పంచిందా.. మీరే చెప్పండి. కొందరు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా విచ్చలవిడిగా డబ్బులు పంచారు. ఓటుకు రూ.5 వేల దాకా యూపీఐ ద్వారా పంపిణీ చేశారు. అవన్నీ బయటకు తీస్తాం. అడ్డగోలుగా సంపాదించిన సొమ్మును పంచి ఎన్నికల్లో అడ్డదారుల్లో గెలుద్దామనుకున్నరు. ఎవరినీ వదిలిపెట్టబోం. రాజకీయాలను కలుషితం చేసే వాళ్లను వదిలిపెట్టబోం. నిజాయితీగా కష్టపడే కార్యకర్తల పోరాటాలను, త్యాగాలకు విలువ లేకుండా చేస్తామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు.తెలంగాణ ఆదాయంలో హైదరాబాద్ వాటా అధికం. కానీ వెనుకబడ్డ ఆదిలాబాద్ లో నిధులు ఎక్కువ ఖర్చు చేస్తోంది. దీనినేమంటారు? అట్లాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు వ్యతిరేకంగా బీసీ సమాజం, హిందూ సమాజం ఓట్లేసి గెలిపించింది. ఒక వర్గానికి కొమ్ముకాస్తున్న కాంగ్రెస్ పార్టీ యావత్ హిందూ సమాజం ఈ తీర్పు ద్వారా "రంజాన్" గిఫ్ట్ ఇచ్చింది. పండుగ చేసుకోమని చెప్పింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని, బండి సంజయ్ ను ఓడించేందుకు ముస్లిం సంఘాలన్నీ ఏకమై 'బండి సంజయ్ కు గుణపాఠం చెబుదాం. అందరూ ఏకమై బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ కు ఓటేయాలని పిలుపినిచ్చింది. చివరకు ఏమైంది? వాళ్లంతా ఒకటైతే... హిందూ సమాజం కూడా ఏకమై బీజేపీ పక్షాన నిలిచింది.ఇప్పుడు కాంగ్రెస్ కు సవాల్ విసురుతున్నా... ప్రజలంతా కాంగ్రెస్ పక్షాన ఉన్నారని భావిస్తే... తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. దమ్ముంటే వెంటనే ఎన్నికలు జరపాలి. బీజేపీ దమ్మేందో చూపిస్తాం...

# నాడు ఎస్సార్ వరదారెడ్డి.. నేడు ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి చెందిన విద్యాసంస్థల అధినేతలు**


**పట్టభద్రుల ఎమ్మెల్సీలో బిజెపి విజయం**





(కోరెం సుధాకర్ రెడ్డి, జనతా న్యూస్ ప్రతినిధి, హుజరాబాద్)


కరీంనగర్ వరంగల్ జిల్లాల్లో ప్రముఖ విద్యాసంస్థలైన ఎస్సార్, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేతలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి చెందారు. 2013లో ఆనాడు వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుండి నాటి టిఆర్ఎస్ అభ్యర్థిగా ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరద రెడ్డి పోటీ చేసి ఓటమి చెందారు. వరదారెడ్డికి వందలాది విద్యాసంస్థలు ఉన్నాయి. హైదరాబాద్ తెలంగాణ తో పాటు ఆంధ్రప్రదేశ్లోనూ ఆయనకు విద్యాసంస్థలు ఉన్నాయి. అలాగే ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేతగా పేరు ఉన్న ఊట్కూరు నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీగా కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. నిజానికి వరద రెడ్డి నరేందర్ రెడ్డి ఇరువురు కూడా పూర్తిస్థాయి రాజకీయ నేతలు కాదు. విద్యాసంస్థల నిర్వహణలో వారికి మంచి పేరు ఉంది. వీరి విద్యాసంస్థల్లో వేలాదిమంది చదువుకొని నేడు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికలు ఇద్దరికీ కూడా అచ్చి రాలేదు. నరేందర్ రెడ్డి గెలుపు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను కూడా నిర్వహించడం గమనార్హం. ఆనాడు అధికారంలో టిఆర్ఎస్ లేకున్నప్పటికీ ఆ పార్టీ తరఫున వరద రెడ్డి పోటీ చేయగా.. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ తరపున నరేందర్ రెడ్డి పోటీ చేశారు. నరేందర్ రెడ్డి ఓటమితో.. ఆయన అనుచరులు నిరాశ నెలకొంది. ఇలా జరుగుతుందని తాము ఊహించలేదని వారు వాపోయారు. ప్రసన్న హరి పెద్ద సంఖ్యలో ఓట్లను చీల్చడంతో బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అనుకున్న విధంగా ప్రచారం చేయలేదని వాదన కూడా ఉంది. నాలుగు జిల్లాల్లో ఆయా నియోజకవర్గాలకు ప్రాతినిథ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు ఈ ఎన్నికను పెద్దగా పట్టించుకోలేదని విమర్శలు కూడా ఉన్నాయి. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ పోటీ చేస్తే కాంగ్రెస్ గెలుపు సులభమయ్యేదనే వాదనలు కూడా వినిపించాయి. ఎన్నికల్లో నరేందర్ రెడ్డి ఒంటరి పోరాటం చేశారని పలువురు పేర్కొంటున్నారు. డబ్బులు కూడా ఓటర్లకు చేరలేదని తెలుస్తోంది. 2013లో ఓటమి చెందినప్పటి నుండి వరదా రెడ్డి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఏది ఏమైనా నాడు వరదా రెడ్డికి, నేడు నరేందర్ రెడ్డి కి.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నష్టం జరిగింది.



## సమయపాలన పాటించని అధికారులు

### స్వేరో నెట్వర్క్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఉప్పులేటి బాబు.

**జనత న్యూస్ బెజ్జంకి :** బెజ్జంకి మండల తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, దీనితో వివిధ అవసరాల నిమిత్తం కార్యాలయానికి వస్తున్న మండల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపిస్తూ సిద్దిపేట జిల్లా స్వేరో నెట్వర్క్ అధ్యక్షులు ఉప్పులేటి బాబు బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు ఉదయం 10 గంటల వరకు కార్యాలయానికి చేరుకొని ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సిబ్బంది. ఉదయం 10:40 ని, అయినప్పటికీ కార్యాలయానికి ఎవరు రాకపోవడంతో వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలు నిరీక్షించాల్సి వస్తుందని ఆరోపించారు. సమయపాలన పాటించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు.



## కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి
# హిందీని తొలగించండి : స్టాలిన్



**చెన్నై :** కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యా విధానం అమలు విషయం లో నెలకొన్న వివాదం కొనసాగుతూనే ఉంది. త్రిభాషా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకి స్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్.. మ–రోసారి కేంద్రంపై విరుచుకు పడ్డారు. తమిళనాడులోని అన్ని కేంద్ర కార్యాలయాల నుంచి హిందీని తొలగించాల న్నారు. తమిళంపై ప్రేమ ఉంటే.. చేతల్లో చూపించాలన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ప్రధాని నరేంద్ర మోదీ కి తమిళం అంటే అపారమైన ప్రేమ అని భాజపా చెబుతోంది. అదే నిజమైతే.. దాన్ని ఆయన చేతల్లో ఎందుకు చూపించడం లేదు..? పార్లమెంటులో సెంగోల్‌ను ఏర్పాటుచేయడం కంటే.. రాష్ట్రం లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి హిందీని తొలగిస్తే బాగుంటుంది. హిందీకి బదులుగా తమిళాన్ని అధికార భాషగా చేసి.. మరిన్ని నిధులు కేటాయించండి. కేంద్ర బడ్జెట్‌లో తిరుక్కురల్‌ను ఉటంకిస్తే సరిపోదు. రాష్ట్రానికి ప్రత్యేక పథకాలు, సత్వర విపత్తు సహాయ నిధి, కొత్త రైల్వే ప్రాజెక్టులను అందించాలి. రైళ్లకు అంత్యోదయ, తేజస్, వందేభారత్ వంటి పేర్లు పెట్టడం ఆపండి. దానికి బదులు తమిళ పేర్లను పెట్టండి. తమిళ భాషపై ప్రేమను మాటల్లో కాకుండా.. చేతల్లో చూపించండి' అని స్టాలిన్ పేర్కొన్నారు.

### తమిళనాడు గొంతు నొక్కేస్తున్నారు..

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. 1971 జనాభాల లెక్కల ఆధారంగానే విభజన ప్రక్రియ చేపట్టాలని ప్రధాని మోదీని స్టాలిన్ అభ్యర్థించారు. ప్రస్తుత జనాభా ప్రకారం.. పార్లమెంటులో తాము 12 సీట్లు కోల్పోయి.. 10 సీట్లు మాత్రమే వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తమిళ రాజకీయాలపై ప్రత్యక్షంగా దాడి చేయడమేనన్నారు. ఈ చర్య రాష్ట్ర గొంతును నొక్కేస్తుందన్నారు. తాము విభజనకు వ్యతిరేకం కాదని.. కానీ, గత 50 ఏళ్లుగా సామాజిక, ఆర్థిక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన తమకు ఇది శిక్ష కాకూడదన్నారు. ఈ సందర్భంగా 2026 జనాభా లెక్కల ఆధారంగా విభజన ప్రక్రియ చేపట్టరాదని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది.

## నియోజకవర్గాల పునర్విభజనతో
# దక్షిణాదికి అన్యాయం : విజయ్




**చెన్నై :** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రంలోని భాజపా, ఇతర రాష్ట్రాల్లోని పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తుందన్నారు. దీన్ని అంగీకరించమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ఆయా రాష్ట్రాలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలి. ఈ విభజన ప్రక్రియ తాజా జనాభా లెక్కల ఆధారంగా ఉంటే పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గే ప్రమాదం ఉంది. దీన్ని ఏమాత్రం అంగీకరించం. గత 50 ఏళ్లుగా తమిళనాడుతో సహా ఇతర దక్షిణాది రాష్ట్రాలు జనాభా పెరుగుదలను నియంత్రించాయి. ఈక్రమంలో ప్రస్తుత జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలు విభజించడం సరికాదు. ఒకరి గెలుపు కోసం ఇంకొకరిని శిక్షించడం అన్యాయం. దక్షిణాది రాష్ట్రాల్లోని నియోజకవర్గాల సంఖ్య తగ్గినా.. ఉత్తరప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఆ సంఖ్య పెరిగినా సహించేది లేదు. అన్ని పార్టీలతో కలిసి దీనిపై పోరాడతాం. ప్రజాప్రతినిధుల కొరత సాధారణ ప్రజలకు సమస్యే కాదు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, నాణ్యమైన విద్య, వైద్యం, రోడ్లు వంటి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముందు వాటిపై దృష్టి సారించాలి' అని ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ద్వారా తక్కువ జనాభా ఉన్న రాష్ట్రాల్లో పార్లమెంట్ స్థానాలు తగ్గుతాయంటూ తమిళనాడు కొంతకాలంగా చెబుతోంది. ఈ వ్యాఖ్యలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కొట్టిపడేశారు. అయినప్పటికీ దీనిపై పలు రాష్ట్రాల తమ ఆందోళనను వ్యక్తంచేస్తున్నాయి. ఇక, ఈ అంశంపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అందులో 1971 జనాభాల లెక్కల ఆధారంగానే విభజన చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.



# యుద్ధమే కావాలంటే మేం రెడీ..
### ట్రంప్ సుంకాలపై చైనా

చైనా దిగుమతులపై 20 శాతం సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న చర్యలపై చైనా స్పందించింది. అమెరికా మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధంలో చివరివరకు పోరాడటానికి తాము సిద్ధమేనని చైనా పేర్కొంది. "అగ్రరాజ్యం మాతో యుద్ధం చేయడానికి నిశ్చయించుకుంటే.. అది సుంకాల యుద్ధమైనా, వాణిజ్య యుద్ధమైనా మరే రకమైన యుద్ధమైనా చివరివరకు పోరాడడానికి మేము సిద్ధంగా ఉన్నాము" అని అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం ప్రకటించింది. తమపై విధిస్తున్న టారిఫ్‌లకు ప్రతిగా అమెరికా ఉత్పత్తులపై తాము 10–15 శాతం సుంకాలు విధిస్తామని తెలిపింది. ఫెంటనిల్ డ్రగ్స్ అక్రమరవాణాను అడ్డుకోవడంలో బీజింగ్ విఫలమవడం వల్లే టారిఫ్‌లను రెట్టింపు చేస్తున్నట్లు ట్రంప్ పేర్కొంటున్నప్పటికీ ఫెంటనిల్ సంక్షోభం దాని సొంత పనే అని డ్రాగన్ ఆరోపించింది. "ఈ మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి మేము చేస్తున్న ప్రయత్నాలను గుర్తించకుండా యూఎస్ తిరిగి మమ్మల్నే నిందిస్తోంది. సుంకాల పేరుతో ఒత్తిడి చేసి.. బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నిస్తోంది. ఇంతకాలం వారికి సహాయం చేసినందుకు వారు మమ్మల్ని శిక్షిస్తున్నారు" అని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ పేర్కొంది. ప్రపంచ దేశాలపై అమెరికా అనుసరిస్తున్న సుంకాలు, బెదిరింపు వ్యూహాలు తమపై ప్రభావం చూపవని తెలిపింది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధికారం చేపట్టిన వెంటనే ట్రంప్ ప్రపంచదేశాలపై వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించారు. తమతో వ్యాపారం చేస్తున్న దేశాలపై పరస్పర సుంకాలు విధిస్తానని ప్రకటించారు. ఇందులో భాగంగానే కెనడా, మెక్సికో, భారత్, చైనాలపై సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. యూఎస్ సుంకాలపై చైనా ప్రతీకార చర్యలకు దిగింది. అగ్రరాజ్యం నుంచి దిగుమతి అవుతున్న బొగ్గు, ధ్రువీకృత సహజ వాయువుపై (ఎల్‌ఎన్‌జీ) 15 శాతం సుంకం విధిస్తున్నట్లు చైనా ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించింది. ముడి చమురు, వ్యవసాయ పరికరాలు, పెద్ద ఇంజిన్ల కార్లపై 10 శాతం సుంకాన్ని వసూలుచేయనున్నట్లు తెలిపింది. బుధవారం జరిగిన అమెరికా కాంగ్రెస్ సంయుక్త సెషన్‌లో ట్రంప్ మాట్లాడుతూ.. భారత్, చైనా సహా పలు దేశాలపై ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు అమలుచేస్తామని వెల్లడించారు.

# మనవరాలి చిట్‌చాట్..
## బామ్మ ఖాతా నుంచి రూ.80 లక్షలు ఖాళీ



**గురుగ్రామ్ :** ఓ బాలిక తెలియకుండా చేసిన పొరపాటు తీవ్ర అనర్థాలకు దారి తీయడమే కాకుండా తన అమ్మమ్మ బ్యాంక్ అకౌంట్‌లోని రూ.80 లక్షలు పోగొట్టుకునేలా చేసింది. అయితే స్కూల్ టీచర్ సహాయంతో ఆ కుటుంబం మోసం నుంచి బయటపడగలిగింది. అసలేం జరిగిందంటే.. గురుగ్రామ్‌కు చెందిన ఓ తొమ్మిదో తరగతి విద్యార్థిని మాటల మధ్యలో తాము భూమిని అమ్మి వేయగా రూ.80 లక్షలు వచ్చాయని..అవి తన బామ్మ ఖాతాలో ఉన్నాయని తన స్నేహితురాలికి చెప్పింది. ఆ విషయాన్ని పదో తరగతి విద్యార్థి విన్నాడు. ఆ డబ్బులను ఎలాగైనా కాజేయాలని ఆ విద్యార్థికి దుర్బుద్ధి పుట్టడంతో ఈ విషయం గురించి తన సోదరుడికి చెప్పాడు. వీరు మరికొందరితో కలిసి వృద్ధురాలి వద్ద ఉన్న డబ్బు కాజేయాలని ప్లాన్ చేశారు. అనుకున్న విధంగానే సుమిత్ కటారియా అనే యువకుడు అన్‌లైన్‌లో బాలికతో పరిచయం పెంచుకొని ఆమె ఫొటోలు సేకరించాడు. అనంతరం వాటిని మార్ఫింగ్ చేసి..డబ్బు ఇవ్వకపోతే సోషల్ మీడియాలో పెడతామని బెదిరించారు. దీంతో తన బామ్మకు తెలియకుండా విద్యార్థిని పలు దఫాలుగా వారి అకౌంట్లకు నగదు బదిలీ చేసింది. డబ్బులన్నీ అయిపోయినా కూడా వారు బెదిరింపులు కొనసాగిస్తుండడంతో ఆ విషయాన్ని బాలిక తమ టీచర్‌కు చెప్పింది. ఆమె సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు రంగంలోకి దిగారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి మొత్తం రూ.36 లక్షలు స్వాధీనం చేసుకున్నామని దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

# 'బోఫోర్స్ కేసులో అతడి సాక్ష్యం కావాలి'..
### అమెరికా సాయం కోరిన సీబీఐ




**న్యూఢిల్లీ :** 1980–90ల్లో దేశ రాజకీయాలను కుదిపేసిన బోఫోర్స్ కుంభకోణంపై సీబీఐ మరోసారి సమగ్ర దర్యాప్తునకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే కేసుకు సంబంధించిన యూఎస్ ప్రైవేటు ఇన్వెస్టిగేటర్ నుంచి కీలక సమాచారం సేకరించేందుకు దర్యాప్తు సంస్థ అమెరికా సాయం కోరింది. అతడి నుంచి సాక్ష్యాలు తీసుకునేందుకు అనుమతినివ్వా లంటూ అగ్రరాజ్యానికి న్యాయపరంగా అభ్యర్థన పంపింది. ఫెయిర్‌ఫాక్స్ గ్రూప్ అధినేత, ప్రైవేటు ఇన్వెస్టిగేటర్ మైఖెల్ హెర్ష్‌మన్ 2017లో భారత్‌లో పర్యటించారు. ఆ సమయంలో పలు ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. బోఫోర్స్ కుంభకోణం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ కేసును పక్కదారి పట్టించేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. దాని గురించి ముఖ్యమైన సమాచారాన్ని పంచుకునేందుకు తాను సిద్ధమేనని వ్యాఖ్యానించారు. మైఖెల్ ఆరోపణలను సీబీఐ సుమోటోగా స్వీకరించి దర్యాప్తు చేపట్టింది. అతడి నుంచి సమాచారం తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ అమెరికా అధికారులకు పలుమార్లు లేఖలు పంపింది. అటు నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో లెటర్ రొగేటరీ పంపేందుకు భారత హోంశాఖను సంప్రదించింది. కేసుల విచారణ, దర్యాప్తు సహకారం కోసం ఒక దేశంలోని కోర్టు.. మరో దేశంలోని కోర్టుకు లిఖిత పూర్వకంగా పంపే అభ్యర్థనే ఈ లెటర్ రొగేటరీ (ఎల్‌ఆర్). దీన్ని పంపేందుకు ఈ ఏడాది జనవరి 14న హోంశాఖ సీబీఐకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అనంతరం ప్రత్యేక కోర్టులో ఫిబ్రవరి 11నే ఈ ఎల్‌ఆర్ అప్లికేషన్‌ను దర్యాప్తు సంస్థ అమెరికాకు పంపించింది. దీనిపై అగ్రరాజ్యం నుంచి స్పందన రావాల్సిఉంది.

### ఏంటీ కుంభకోణం..

భారత సైన్యానికి 155 ఎం.ఎం. హొవిట్జర్ గన్ల సరఫరా విషయమై స్వీడన్‌కు చెందిన ఎ.బి.బోఫోర్స్ కంపెనీతో ఒప్పందం కుదిరింది. రూ.1,437 కోట్ల వ్యయంతో 400 గన్లు కొనుగోలు చేయడానికి 1986 మార్చి 24న ఒప్పందం కుదిరింది. అయితే ఈ విషయంలో రూ.64 కోట్లు చేతులు మారినట్టు 1987 ఏప్రిల్ 16న స్వీడిష్ రేడియో ప్రకటించింది. దీనిపై 1990 జనవరి 22న సీబీఐ కేసు నమోదు చేసింది. బోఫోర్స్ కంపెనీ అధ్యక్షుడు మార్టిన్ ఆర్డ్‌బో, మధ్యవర్తులుగా వ్యవహరించిన విన్ చద్దా, హిందూజా సోదరులు, ఇటలీకి చెందిన ఒట్టావియో ఖత్రోచి, అప్పటి రక్షణశాఖ కార్యదర్శి ఎస్.కె.భట్నాగర్‌లపై రెండు విడతలుగా అభియోగ పత్రాలు దాఖలు చేసింది. దర్యాప్తునకే దాదాపు రూ.250 కోట్లు ఖర్చయింది. కుంభకోణం విలువ కన్నా, దర్యాప్తు వ్యయమే అధికంగా ఉందని భావించి 2005లో దిల్లీ హైకోర్టు ఈ కేసును కొట్టివేసింది. అంతేగాక, లంచాలు ఇచ్చినట్లు సీబీఐ నిరూపించలేకపోయిందని తెలిపింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ 2018లో సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కానీ, సుమారు 13 ఏళ్ల ఆలస్యంగా అప్పీలు చేయడం సరికాదంటూ అత్యున్నత న్యాయస్థానం దాన్ని తిరస్కరించింది. అయితే, దీనిపై 2005లోనే అజయ్ అగర్వాల్ అనే న్యాయవాది అప్పీల్ చేయగా.. ఆ పిటిషన్‌పై విచారణ కొనసాగుతోంది.



## అమెరికా సైనికులను చంపిన
# ఆ ఉగ్రవాది చిక్కాడు : ట్రంప్

అఫ్గానిస్థాన్ రాజధాని కాబుల్ విమానాశ్రయంలో 2021లో ఆత్మాహుతి పేలుళ్లకు పాల్పడిన సూత్రధారి చిక్కాడు. దాడికి ప్రణాళిక రచించిన కీలక ఉగ్రవాదిని పాకిస్థాన్ సహాయంతో అరెస్టు చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికా చట్టాల ప్రకారం అతడికి సత్వరమే శిక్ష విధిస్తామని వెల్లడించారు. "ఆ దాడి దేశ చరిత్రలో అత్యంత అవమానకరమైన క్షణం. మూడున్నర సంవత్సరాల క్రితం జరిగిన ఉగ్రదాడిలో 13 మంది అమెరికా సైనికులతో సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఆ దారుణానికి ఒడిగట్టిన టెర్రరిస్టును అదుపులోకి తీసుకున్నామని ప్రకటిస్తున్నందుకు సంతోషిస్తున్నాను" అని అధ్యక్షుడు వెల్లడించారు. అరెస్టులో సహకరించిన పాకిస్థాన్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ ఉగ్రవాది పేరు మహమ్మద్ షరీఫుల్లా అని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2021, ఆగస్టులో అఫ్గానిస్థాన్‌లో పౌర ప్రభుత్వాన్ని కూల్చి తాలిబన్లు అధికారాన్ని హస్తగతం చేసుకున్న సంగతి తెలిసిందే. వారి పాలనలో ఆంక్షలకు భయపడి ప్రాణభయంతో పలువురు దేశం విడిచివెళ్లిపోయారు. కంచెలు దాటి, విమానాన్ని పట్టుకొని వేలాడుతూ దేశం దాటేందుకు వారు చేసిన ప్రయత్నాలతో ఎన్నో హృదయ విదారక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒకవైపు ప్రజలు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్న తరుణంలో ఉగ్రవాదులు తమ పంజా విసిరారు. కాబుల్ విమానాశ్రయం వెలుపల, అబే గేటులోంచిలోనికి వెళ్లేందుకు జనం భారీగా గుమిగూడిన చోట ఒక పేలుడు సంభవించింది. కాసేపటికే అక్కడికి సమీపంలోని బేరన్ హొటల్ వద్ద మరో పేలుడు చోటుచేసుకుంది. దాంతో 13 మంది అమెరికా సైనికులు, అఫ్గానిస్థాన్‌కు చెందిన 170 మంది పౌరులు బలయ్యారు. 20 ఏళ్ల పాటు అఫ్గానిస్థాన్‌లో సేవలు అందించిన తమ బలగాలను అమెరికా ఆకస్మికంగా ఉపసంహరించుకోవడంతోనే తాలిబన్లకు అవకాశం లభించింది. ఇది జోబైడెన్ ప్రభుత్వానికి మాయని మచ్చ అయింది. అదే విషయాన్ని తాజాగా ట్రంప్ ప్రస్తావించారు. బైడెన్ బలగాలను ఉపసంహరించుకున్న తీరు చూసే.. ఉక్రెయిన్‌పై దాడి చేసేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ ధైర్యం చేశారని విమర్శించారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ప్రారంభించింది. మూడేళ్లుగా సాగుతోన్న ఆ యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ ప్రయత్నాలు మొదలుపెట్టిన సంగతి తెలిసిందే.

# భూమిపైకి ఎప్పుడు వస్తామో తెలియట్లేదు
### సునీతా విలియమ్స్




మూడోసారి రోదసిలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ దాదాపు తొమ్మిది నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయారు. ఆమెతో పాటు వెళ్లిన బచ్ విల్మోర్ కూడా అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. అలాగే వారిని భూమిపైకి తీసుకువచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని.. దాంతో వ్యోమగాములు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని గతంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. వీటన్నింటిపైనా ఈ వ్యోమగాములు స్పందించారు. "మేము భూమిమీదకు తిరిగి వచ్చే విషయంలో నెలకొన్న అనిశ్చితి చాలా కష్టమైన అంశం" అని అంతరిక్ష కేంద్రం నుంచి సునీత మీడియాతో మాట్లాడారు. సుదీర్ఘంగా తాము అంతరిక్షంలో ఉండిపోవడం వల్ల వ్యక్తమవుతోన్న ఆందోళనలను తోసిపుచ్చినప్పటికీ.. భూమిపై ఉన్న ప్రజలపై ఈ ప్రభావం ఉంటుందని విలియమ్స్, విల్మోర్ అంగీకరించారు. 2030లో అంతరిక్ష కేంద్రం జీవితకాలం పూర్తయిన తర్వాత నాసా, అంతర్జాతీయ భాగస్వామ్య దేశాలు దాన్ని కక్ష్య నుంచి వేరు చేయనున్నాయి. అప్పటికంటేముందే ఐఎస్ఎస్‌ను రిటైర్ చేయాలని ఇటీవల మస్క్ ప్రతిపాదించారు. "ఇప్పుడు అత్యున్నత దశలో ఉన్నాం. నిష్క్రమించడానికి సరైన సమయం కాదని నేను భావిస్తున్నాను" అని విలియమ్స్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐఎస్ఎస్‌లో చిక్కుపోయిన వారిని బైడెన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలపై విల్మోర్ స్పందించారు. "అవి రాజకీయ సంబంధమైన వ్యాఖ్యలు. అవి జీవితంలో ఒక భాగం. ఈ వ్యవహారంలో రాజకీయాలకు ఏమాత్రం జోక్యం లేదని నా అభిప్రాయం. అందరికీ డొనాల్డ్ ట్రంప్, మస్క్ పట్ల గౌరవం ఉంది. మేం మా దేశానికి, మా నాయకులకు మద్దతు ఇస్తాం. వారికి మా కృతజ్ఞతలు" అని మాట్లాడారు. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో వారు ఐఎస్ఎస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. ప్రణాళిక ప్రకారం ఐఎస్ఎస్‌లో ఉన్న వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు వారం రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమిని చేరుకుంది. సునీతా విలియమ్స్, విల్మోర్ అప్పటినుంచి ఐఎస్ఎస్‌లోనే ఉంటున్నారు. వారిని తిరిగి తీసుకురావడానికి నాసా స్పేస్‌ఎక్స్‌తో కలిసి పనిచేస్తోంది. ఈ ఇద్దరు వ్యోమగాములను తీసుకురావాలంటే అంతకంటే ముందు కొందరిని ఐఎస్ఎస్‌కు పంపించాల్సి ఉంటుంది. ఈ ప్రయోగం చేపట్టడానికి స్పేస్ ఎక్స్ సమయం కావాలనడంతో ఈ ఆలస్యం జరిగిందని గతంలో అధికారులు పేర్కొన్నారు.




# స్టార్‌లింక్ డీల్ రద్దు.. కరెంటు కోతలు తప్పవు
### అమెరికాకు కెనడా హెచ్చరిక

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి మిత్రులు, శత్రువులు అని తేడా లేకుండా అందరిపైనా సుంకాల మోత మోగిస్తున్నారు. పొరుగుదేశం కెనడాపైనా 25 శాతం టారిఫ్ విధించారు. దీంతో ఆ దేశం నుంచి స్పందన వచ్చింది. యూఎస్‌పై ఒంటారియో ప్రీమియర్ డగ్ ఫోర్డ్ తీవ్ర హెచ్చరికలు చేశారు. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్‌తో ఉన్న 100 మిలియన్ డాలర్ల డీల్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కెనడాపై ట్రంప్ విధించిన 25 శాతం సుంకాలు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. కెనడా ఇంధన ఎగుమతులపై 10 శాతం టారిఫ్ ఉంది. ఈ నిర్ణయాలు కెనడా నేతలను తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తున్నాయి. తాము ఆర్థికంగా దెబ్బతింటుంటే చూస్తూ కూర్చోబోమని డగ్ ఫోర్డ్ తేల్చిచెప్పారు. "వారు ఒంటారియోను ధ్వంసం చేస్తుంటే.. చూస్తూ ఊరుకోను. చిరునవ్వుతోనే చేయాల్సిందంతా చేస్తాను. కరెంట్ కోతలు విధిస్తాను. ఒంటారియోతో స్టార్‌లింక్‌కు ఉన్న 100 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని రద్దు చేస్తున్నాను. అది పూర్తయింది. ఆయన (ట్రంప్‌ను ఉద్దేశించి) కెనడా ప్రజలను తక్కువ అంచనా వేస్తున్నారు. మా స్టోర్ల నుంచి యూఎస్ ఆల్కహాల్‌ను తొలగించాలని యోచిస్తున్నాం" అని ఫోర్డ్ వెల్లడించారు. అమెరికాకు అత్యధిక ఇంధన ఎగుమతులు కెనడా నుంచే వెళ్తున్నాయి. కెనడాకు చెందిన ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, హైడ్రోపవర్, సహజవాయువు, ఎలక్ట్రిసిటీపై యూఎస్ ఆధారపడింది. "వారు మా ఇంధనంపై ఆధారపడ్డారు. వాళ్లు కూడా నొప్పి భరించాలి" అని ఫోర్డ్ వ్యాఖ్యలు చేశారు. చిరకాల మిత్రదేశంపై ట్రంప్ అసలు సుంకాలు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. "సన్నిహిత మిత్రులు, పొరుగువారిపై ఎందుకు దాడి చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. కెనడాపై సుంకం అంటే అమెరికన్లపై పన్ను విధించడం కిందికే వస్తుంది" అన్నారు. ఇక, స్టార్‌లింక్ డీల్ కింద తొలుత 15వేల ఇళ్లు, వాణిజ్య సముదాయాలకు ఇంటర్నెట్ సదుపాయం అందించాల్సి ఉంది.

# సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌గా 13 ఏళ్ల బాలుడు
### ట్రంప్ అనూహ్య ప్రకటన



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ప్రసంగించారు డొనాల్డ్ ట్రంప్. ఈసందర్భంగా సభలో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. యూఎస్ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌గా 13 ఏళ్ల బాలుడిని నియమించి ట్రంప్ అందర్నీ ఆశ్చర్యపర్చారు. కొన్నేళ్ల పాటు క్యాన్సర్‌తో పోరాడి ఆ మహమ్మారిని జయించిన ఆ టెక్సాస్ కుర్రాడి కథను అధ్యక్షుడు పంచుకున్నారు. "13 ఏళ్ల డీజే డేనియల్ ఇప్పుడు మన గ్యాలరీలో కూర్చున్నాడు. 2018లో ఆ బాలుడు అరుదైన క్యాన్సర్ వ్యాధి బారిన పడ్డాడు. కేవలం ఐదు నెలలు మాత్రమే బతుకుతాడని అప్పట్లో వైద్యులు తేల్చారు. కానీ, డేనియల్ కుంగిపోలేదు. ఎన్ని కష్టాలు ఎదురైనా వ్యాధితో ధైర్యంగా పోరాడాడు. పోలీసు అధికారి కావాలన్న అతడి కలను ఎన్నడూ వదులుకోలేదు. అందుకే ఇప్పుడు మేం అతడికి గొప్ప గౌరవం ఇవ్వబోతున్నాం. యూఎస్ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌గా ఆ బాలుడిని తీసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ సీన్ కరన్‌ను కోరుతున్నా" అని ట్రంప్ వెల్లడించారు. దీంతో రిపబ్లికన్ సభ్యులంతా లేచి నిలబడి చప్పట్లతో బాలుడిని అభినందించారు. చాలామంది డెమోక్రటిక్ సభ్యులు కూడా ఈ నిర్ణయానికి మద్దతివ్వడం విశేషం. ట్రంప్ మాటలు వినగానే డేనియల్ తండ్రి అతడిని ఎత్తుకొని సభకు చూపించారు. సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ కరన్.. బాలుడి దగ్గరకు వెళ్లి అధికారిక ఐడీ కార్డును అతడికి అందజేశారు. ఆ ఐడీని చూసుకుని డేనియల్ మురిసిపోయాడు. అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపాడు.

# కొందరికి అదే పని..

## వాళ్లు ఎదగడానికే మాపై విమర్శలు : గంభీర్

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు టీమ్‌ఇండియా చేరుకుంది. తొలి సెమీస్‌లో ఆసీస్‌ను చిత్తు చేసి టైటిల్ కోసం దూసుకొచ్చింది. దుబాయ్ వేదికగానే భారత్ అన్ని మ్యాచ్‌లు ఆడుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్లు తమ అక్కసును వెళ్లగక్కుతూ టీమ్‌ఇండియాపై విమర్శలు చేశారు. ఒకేచోట ఉండి ఆడటం వల్ల దుబాయ్ పిచ్‌లు భారత్‌కు అనుకూలంగా మారాయనేది వారి విమర్శ. ఈ క్రమంలో ఆసీస్‌తో మ్యాచ్ అనంతరం ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్రంగా స్పందించాడు. కొందరికి ఇదే పనిగా ఉందని.. సమాజంలో వారు ఎదిగేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటారని తెలిపాడు. “దుబాయ్ వేదిక మాకు తటస్థమైన స్టేడియం. టోర్నీలో ఇతర జట్ల మాదిరిగానే మాకూ కొత్తే. చివరిగా ఇక్కడ మేం ఎప్పుడు ఆడామనేది గుర్తు లేదు. మేం ట్రోఫీ మొదటినుంచి ప్రణాళికాబద్ధంగా ఆడాం. తుది జట్టు కూర్పులోనూ ఇద్దరు స్పెషలిస్ట్ స్పిన్నర్లను తీసుకోవాలని అనుకున్నాం. అందుకు తగినట్లుగానే ముందుకుసాగాం. ఉపఖండ పిచ్‌ల గురించి అందరికీ తెలిసిందే. నాణ్యమైన బౌలింగ్ ఎటాక్‌తో బరిలోకి దిగాం. అసలు మాకే దుబాయ్ పిచ్ అడ్వాంటేజ్ అని ఎలా చెప్పగలరు? మేం ఇక్కడేమీ ప్రాక్టీస్ చేయలేదు. ఐసీసీ అకాడమీలో సాధన చేశాం. అక్కడికి, దుబాయ్ మైదానంలోని పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంది. కొందరు ఎప్పుడూ విమర్శలు చేయడమే పనిగా పెట్టుకుంటారు. ఎందుకంటే వారూ ఎదగాలిగా” అని గంభీర్ వ్యాఖ్యానించాడు.



### 140 కోట్ల మంది భారతీయులకు...

న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లను కోల్పోయిన తర్వాత గంభీర్‌తోపాటు టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్‌పై విమర్శలు వచ్చాయి. జట్టు ఎంపికలో చాలా లోపాలు ఉన్నాయంటూ పలువురు కామెంట్లు చేశారు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు కూడా ఇలాంటి విమర్శలే వచ్చాయి. అయితే, తాను వీటిని అస్సలు పట్టించుకోనని.. 140 కోట్ల మంది భారతీయులకు తాను నిజాయతీపరుడిగా ఉంటే చాలన్నారు. “బయట మా గురించి ఎన్ని మాట్లాడుకున్నా నేను పట్టించుకోను. వారు ఏ అజెండాతో మాట్లాడతారో తెలియదు. నేను నిజాయతీగా నా బాధ్యతలు నిర్వహించడం పైనే దృష్టిపెడతా” అని గంభీర్ తెలిపాడు.

### రోహిత్ భవిష్యత్తుపై ఇప్పుడెందుకు చర్చ?: గౌతమ్ గంభీర్

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత సారథి రోహిత్ శర్మ దూకుడుగా ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నాడు. కానీ, వాటిని భారీ స్కోర్లుగా మలచడంలో మాత్రం విఫలం కావడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. ఈ టోర్నీ ముగిసిన తర్వాత అతడి భవిష్యత్తు ఏంటనేది సగటు అభిమాని మనసులో మెదిలే ప్రశ్న. దానికి గౌతమ్ గంభీర్ కూడా సూటిగా సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం. అలాగే రోహిత్ ప్రస్తుత ఫామ్ గురించి గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లో ఆసీస్‌పై భారత్ విజయం సాధించిన అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గంభీర్ మాట్లాడాడు. ఈ సందర్భంగా ఓ విలేఖరి అడిగిన ప్రశ్నకు గంభీర్ స్పందించాడు.

**జర్నలిస్ట్:** రోహిత్ ఫామ్ గురించి.. అతడి భవిష్యత్తు గురించి మీరు ఏమనుకుంటున్నారు? ఎంతవరకు ఆడగలడని మీరు భావిస్తున్నారు?

**గంభీర్:** ఇప్పుడు మనం ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లోకి అడుగుపెట్టాం. ఇలాంటి సమయంలో కెప్టెన్ భవిష్యత్తు గురించి ఎందుకు మాట్లాడుకోవడం. దూకుడైన ఆటతీరుతో కెప్టెన్ ఆడుతుంటే అంతకంటే ఇంకేం కావాలి. డ్రెస్సింగ్ రూమ్‌కు సానుకూల సంకేతాలు ఇవ్వడంలో రోహిత్ ముందుంటాడు. నిర్భయంగా ఆడేందుకు అతడే దిక్సూచి. మీరు పరుగులనే చూస్తారు. మేం అతడి ప్రభావం ఎంతనేది గణిస్తాం. అదే మీకు, మాకు తేడా. జర్నలిస్టులు, విశ్లేషకులు ఎవరైనా సరే ఒక ఆటగాడి గణాంకాలను చూస్తారు. కానీ కోచ్‌గా, జట్టు మేనేజ్‌మెంట్‌గా మేం వాటి గురించి ఆలోచించం. కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపిస్తున్నాడా లేదా అనేది చూస్తాం. అంతకంటే ఇంకేమీ అవసరం లేదు.



## వన్డేలకు స్టీవ్‌స్మిత్ గుడ్‌బై

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియాకు షాక్ తగిలింది. భారత్ చేతిలో ఆరు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. దీంతో వన్డేలకు ఆ జట్టు సారథి స్టీవ్ స్మిత్ వీడ్కోలు పలికేశాడు. బ్యాటర్‌గా స్మిత్ (73) రాణించినా జట్టు మాత్రం విజయం సాధించలేకపోయింది. దీంతో 35 ఏళ్ల స్మిత్ అంతర్జాతీయ వన్డేలకు రిటైర్‌మెంట్ తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. అయితే, టీ20లతోపాటు టెస్టుల్లో కొనసాగుతానని వెల్లడించాడు. “జాతీయ జట్టు తరఫున ఆడటం ఎప్పుడూ గర్వకారణమే. వన్డేల్లో ప్రతి క్షణమూ ఆస్వాదించా. ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలు ఉన్నాయి. రెండు వరల్డ్ కప్‌ల్లో సభ్యుడిగా ఉన్నా. ఇప్పుడీ నిర్ణయంతో వన్డే ప్రపంచ కప్ 2027 కోసం జట్టును సన్నద్ధం చేసేందుకు ఆసీస్ మేనేజ్‌మెంట్‌కు అవకాశం వచ్చినట్లవుతుంది. ఇప్పటికీ నాకు టెస్టు క్రికెట్ మొదటి ప్రాధాన్యం. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకున్నాం. వెస్టిండీస్, ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లు ఉన్నాయి. టెస్టు క్రికెట్‌ను ఇంకా ఆడగలనని భావిస్తున్నా” అని స్మిత్ వెల్లడించాడు. ఆస్ట్రేలియా తరఫున 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన స్మిత్ ఇప్పటివరకు 170 వన్డేలు ఆడాడు. 12 సెంచరీలు, 35 అర్ధశతకాలతో 5,800 పరుగులు చేశాడు. బౌలర్‌గానూ 28 వికెట్లు పడగొట్టాడు. 116 టెస్టులు ఆడిన స్మిత్ 10,271 పరుగులు చేశాడు. 67 అంతర్జాతీయ టీ20ల్లో 1,094 పరుగులు చేశాడు. 2015, 2023 వన్డే ప్రపంచకప్‌లను నెగ్గిన ఆసీస్ జట్టులో స్మిత్ సభ్యుడు. ఇటీవల కాలంలో ఆసీస్ నుంచి వన్డేలకు వీడ్కోలు పలికిన రెండో ఆటగాడిగా స్మిత్ నిలిచాడు. ప్యాట్ కమిన్స్ గాయం కారణంగా స్మిత్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. ఈ టోర్నీలో సెమీస్‌లోనే ఆసీస్ ఓటమిపాలు కావడంతో స్మిత్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడు. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కాకముందే మార్కస్ స్టాయినిస్ అనూహ్యంగా వన్డేలకు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. గాయం కారణంగా అతడు ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడని అప్పట్లో వార్తలు వచ్చాయి.

## ఫైనల్‌కు న్యూజిలాండ్.. ఇక భారత్‌తో అమీతుమీ

ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత్‌తో తలపడేదెవరో తేలిపోయింది. రెండో సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై న్యూజిలాండ్ 50 పరుగుల తేడాతో విజయం సాధించింది. ట్రోఫీ కోసం టీమ్‌ఇండియాతో అమీతుమీ తేల్చుకోనుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 362 పరుగులు సాధించింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 312 పరుగులు చేసింది. డేవిడ్ మిల్లర్ 100*(67) సెంచరీతో చివరివరకూ పోరాడాడు. స్కోరు 300 దాటిందంటే అతడే కారణం. కెప్టెన్ బవుమా 56(71), డస్సెన్ 69(66)లు అర్ధ సెంచరీలు చేశారు. హెన్రిచ్ క్లాసెన్ 3(7) నిరాశపర్చాడు. న్యూజిలాండ్ స్పిన్నర్ శాంట్నర్ మూడు వికెట్లు తీశాడు. ఫిలిప్స్, హెన్రీ రెండు, బ్రేస్‌వెల్, రచిన్ రవీంద్ర ఒక్కో వికెట్ తీశారు.



### మిల్లర్ మెరుపులు..


తొలి ఓవర్‌లో ఎనిమిది పరుగులతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ప్రారంభమైంది. నాలుగు ఫోర్లు బాది దూకుడుగా కనిపించిన రికెల్టన్ 17(12).. 4.5వ ఓవర్‌లో హెన్రీ బౌలింగ్‌లో బ్రేస్‌వేల్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన డస్సెన్ కెప్టెన్ బావుమాతో కలిసి స్కోర్‌ను పరుగులు పెట్టించాడు. ఇద్దరూ అర్ధ సెంచరీలు చేశారు. శాంట్నర్ బౌలింగ్‌లో బావుమా క్యాచ్ మిస్ చేసిన విలియమ్సన్.. మరోసారి ఆ తప్పిదానికి అవకాశం ఇవ్వలేదు. దీంతో 56 పరుగుల వద్ద బవుమా పెవిలియన్ బాటపట్టాడు. డస్సెన్ (69)ను శాంట్నర్ బౌల్డ్ చేశాడు. అప్పటినుంచి సఫారీల పతనం మొదలైంది. మిల్లర్ చివరి వరకు పోరాడినప్పటికీ.. రన్‌రేట్ అంతకంతకూ పెరిగిపోవడంతో ఫలితం లేకపోయింది. మార్‌క్రమ్ 31(29), క్లాసెన్ 3(7), ముల్డర్ 8(13), మార్కో యాన్సెన్ 3(7), కేశవ్ మహారాజ్ 1(4), రబాడా 16(22), ఎంగిడి 1*(2) పరుగులు చేశారు.

### రచిన్, విలియమ్సన్ సెంచరీలు..

న్యూజిలాండ్ జట్టులో రచిన్ రవీంద్ర 108(101), కేన్ విలియమ్సన్ 102(94) సెంచరీలు చేశారు. ఇద్దరు కలిసి రెండో వికెట్‌కు 164 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇన్నింగ్స్ ఆఖర్లో ఫిలిప్స్ 49*(27) మెరుపు షాట్లతో ఆకట్టుకున్నాడు. మిచెల్ 49(37) అర్ధ సెంచరీ చేజార్చుకున్నాడు. విల్ యంగ్ 21(23), బ్రేస్‌వెల్ 16 (12), లేథమ్ 4 (5), శాంట్నర్ 2*(1) పరుగులు చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడి మూడు వికెట్లు, రబాడా రెండు వికెట్లు, ముల్డర్ ఒక వికెట్ తీశారు. ఇదిలా ఉండగా.. ఇటీవలి ఐసీసీ టోర్నీల్లో ఆఖరి మెట్టుపై బోల్తాకొట్టిన కివీస్.. ఆదివారం భారత్‌తో తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.

## సమయం ఉంది.. రిలాక్స్ అయిపోమని చెప్పా: రోహిత్ శర్మ


వరుసగా మూడోసారి టీమ్‌ఇండియా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు చేరుకుంది. దుబాయ్ వేదికగా జరిగిన తొలి సెమీస్‌లో ఆసీస్‌పై విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇక ఫైనల్‌లో ఎవరు ప్రత్యర్థి అనేది ఇవాళ తేలనుంది. తుది పోరుకు కూడా ఇంకా నాలుగు రోజుల సమయం ఉంది. మార్చి 9న దుబాయ్‌లోనే ఫైనల్ జరగనుంది. ఈ క్రమంలో తమ జట్టు సన్నద్ధతపైనా, సెమీస్‌లో గెలుపుపై భారత కెప్టెన్ రోహిత్ శర్మ కీలక వ్యాఖ్యలు చేశాడు. “చివరి బంతి వరకు ఆట ఎటువెళ్తుందో తెలియదు. అయితే, మ్యాచ్ సగం ముగిశాక ఈ స్కోరు ఛేదించవచ్చని అర్థమైంది. మావాళ్లు చాలా అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. లక్ష్య ఛేదనలో చాలా నిలకడైన ఆటతీరు ప్రదర్శించారు. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌కు ఉపయోగించిన పిచ్‌తో పోలిస్తే ఇప్పుడిది కాస్త నయం. అయితే, నాణ్యమైన క్రికెట్ ఆడితే గెలుస్తామని మ్యాచ్ ముందే జట్టంతా కలిసి చర్చించుకున్నాం. ఆరుగురు బౌలర్లు ఉండటం జట్టుకు ఎప్పుడూ బలమే. అదేవిధంగా ఎనిమిదో నంబర్ వరకు బ్యాటింగ్ చేసే సత్తా మాకుంది. దేశం కోసం ఎన్నోఏళ్లుగా అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన ఘనత విరాట్ కోహ్లీది. మేం బ్యాటింగ్ చేసేటప్పుడు చాలా కామ్‌గా ఉన్నాం. శ్రేయస్ – విరాట్ భాగస్వామ్యం మమ్మల్ని రేసులో ముందుకు తీసుకెళ్లింది. అక్షర్, విరాట్, కేఎల్, హార్దిక్.. ఇలా ప్రతీ బ్యాటర్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. పాండ్య చివర్లో అద్భుతమైన షాట్లతో విజయతీరాలకు చేర్చాడు. మేం ఇప్పుడు ఫైనల్‌కు చేరాం. అక్కడ మాకు ప్రత్యర్థి ఎవరనేది తెలియదు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా రెండూ బలమైనవే. కాబట్టే ఆ జట్లు సెమీస్‌కు చేరాయి. రెండో సెమీఫైనల్ మ్యాచ్ పైనా మేం కన్నేశాం. తీవ్ర ఒత్తిడి ఉండే టోర్నీలో మాకు కాస్త సమయం దొరికింది. మా వాళ్లను అప్పటి వరకు రిలాక్స్ అయిపోమని చెప్పా. విశ్రాంతి తీసుకుని ఫైనల్ గురించి ఆలోచిస్తాం. జట్టు కూర్పు గురించి ఇప్పుడే తొందరపడటం లేదు” అని రోహిత్ వెల్లడించాడు.



## అల్ట్రావయలెట్ నుంచి తొలి విద్యుత్ స్కూటర్..

### సింగిల్ ఛార్జ్‌తో 261 కి.మీ

విద్యుత్ మోటార్ సైకిళ్లు తయారుచేసే స్టార్టప్ సంస్థ అల్ట్రావయలెట్. దేశీయ మార్కెట్‌లోకి తొలిసారిగా ఈవీ స్కూటర్‌ను లాంచ్ చేసింది. టెసెరాక్ట్ పేరుతో దీన్ని తీసుకొచ్చింది. దీని ధరను రూ.1.20 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. తొలి 10 వేల మంది కస్టమర్లకు మాత్రమే ఈ ధరకు ఈవీని విక్రయిస్తామని పేర్కొంది. భవిష్యత్‌లో యూరోపియన్ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు లాంచ్ సందర్భంగా కంపెనీ తెలిపింది. యుద్ధ విమానాల స్ఫూర్తితో ఈ స్కూటర్‌ను రూపొందించింది. స్కూటర్ ముందు భాగం షార్ప్ కట్స్‌తో కనిపిస్తుంది. ఫ్లోటింగ్ డీఆర్ఎల్స్, డ్యూయల్ ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్స్ ఇచ్చారు. డిసెర్ట్, స్టెల్త్ బ్లాక్, సోనిక్ పింక్ రంగుల్లో లభిస్తుంది. 14 అంగుళాల వీల్స్ ఇచ్చారు. ఇక ఫీచర్ల విషయానికొస్తే.. ఈ స్కూటర్ 7 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లేతో వస్తోంది. సీటు దిగువ భాగంలో 34 లీటర్ల స్టోరేజీ ఇచ్చారు. రైడ్ అనలిటిక్స్ సదుపాయం ఉంది. సేఫ్టీ కోసం ఫ్రంట్, రియర్ రాడార్ టెక్, బ్లైండ్ స్పాట్ మానిటరింగ్, కొలిజన్ అవాయిడెన్స్, ఓవర్‌టేక్ అలర్ట్స్, లేన్ ఛేంజ్ అసిస్ట్, రియర్ కొలిజన్ అలర్ట్, ఇంటిగ్రేటెడ్ డాష్‌క్యామ్, హ్యాండిల్ బార్ వద్ద హాప్టిక్ ఫీడ్‌బ్యాక్ వంటి సదుపాయాలు ఉన్నాయి. ఇందులో 6కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ అమర్చారు. సింగిల్ ఛార్జ్‌తో ఈ స్కూటర్ 261 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. ఇందులో అమర్చిన ఎలక్ట్రిక్ మోటార్ 20 హెచ్‌పీ పవర్‌ను ఉత్పత్తి చేస్తుంది. కేవలం 2.9 సెకన్లలో 0 నుంచి 80 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని కంపెనీ తెలిపింది. టాప్‌స్పీడ్ 125 కిలోమీటర్లుగా పేర్కొంది. ఎనిమిదేళ్ల పాటు బ్యాటరీపై వారెంటీ ఇస్తున్నట్లు కంపెనీ తెలిపింది.



## భారీ లాభాల్లో ముగిసిన సూచీలు..

### 22,350కు చేరువలో నిఫ్టీ


**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం భారీ లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. రోజంతా అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. రూపాయి బలపడడం, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం కూడా పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. దీంతో వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఓ దశలో సెన్సెక్స్ 900 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ సైతం 22,400 మార్కుకు చేరువైంది. చివరికి 22,350కు చేరువలో ముగిసింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 2 శాతం మేర రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 73,005.37 (క్రితం ముగింపు 72,989.93) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 73,933.80 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 740.30 పాయింట్ల లాభంతో 73,730.23 వద్ద ముగిసింది. నిఫ్టీ 255.80 పాయింట్ల లాభంతో 22,338.45 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 23 పైసలు మేర బలపడి 86.96 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జొమాటో, మారుతీ సుజుకీ మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్టీపీసీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70.52 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు2929 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



## యాపిల్ ఇంటెలిజెన్స్‌తో ఐప్యాడ్ ఎయిర్ 2025..

### ఏ16 బయోచిప్‌తో ఐప్యాడ్

ప్రముఖ టెక్ కంపెనీ యాపిల్ రెండు ఐప్యాడ్‌లను లాంచ్ చేసింది. గతేడాది తీసుకొచ్చిన ఐప్యాడ్‌లకు మంచి ఆదరణ వచ్చిన నేపథ్యంలో సరికొత్త ఫీచర్లు జోడించి తాజాగా విడుదల చేసింది. యాపిల్ ఎం3 చిప్‌తో ఐప్యాడ్ ఎయిర్ (2025)ను తీసుకొచ్చింది. దీంతోపాటు ఏ16 బయోనిక్ చిప్‌తో 11 జనరేషన్ ఐప్యాడ్ (2025)ను పరిచయం చేసింది. ఈ రెండు కొత్త డివైజ్‌ల ధర, ఫీచర్లు చూద్దాం.



### ఐప్యాడ్ ఎయిర్ (2025)

యాపిల్ ఎం3 చిప్‌తో ఈ ఐప్యాడ్ ఎయిర్‌ని తీసుకొచ్చారు. ఎం1 ఆధారిత ఐప్యాడ్ ఎయిర్ కంటే దాదాపు రెండు రెట్లు వేగంగా పనిచేస్తుంది. యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్‌కు సపోర్ట్ చేసే ఐప్యాడ్‌ఓఎస్ 18తో నడుస్తుంది. గతేడాదిలో తీసుకొచ్చిన ఐప్యాడ్ ఎయిర్‌లానే రెండు ఎంపికలతో వస్తోంది. లిక్విడ్ రెటినా ఎల్‌సీడీ స్క్రీన్ అమర్చారు. 12 ఎంపీ వైడ్ కెమెరా, ముందువైపు 12 ఎంపీ కెమెరా ఇచ్చారు. యూఎస్‌బీ టైప్–సీ పోర్ట్‌తో వస్తోంది. భారత్‌లో ఐప్యాడ్ ఎయిర్ 11 అంగుళాల వైఫై మోడల్ ధర రూ.59,900 నుంచి ప్రారంభమవుతుంది. ఇక వైఫైం సెల్యులార్ వేరియంట్ రూ.74,900 నుంచి మొదలవుతుంది. 13 అంగుళాల వైఫై మోడల్ ధర రూ.79,900, వైఫైం సెల్యులార్ మోడల్ రూ.94,900 నుంచి ప్రారంభమవుతుంది. బ్లూ, పర్పుల్, స్పేస్ గ్రే, స్టార్‌లైట్ రంగుల్లో లభిస్తాయి. ఐప్యాడ్ ఎయిర్ కోసం రెండు ఎంపికలతో మ్యాజిక్ కీబోర్డ్ తీసుకొచ్చారు. 11 అంగుళాల కీబోర్డ్ ధర రూ.26,900 కాగా, 13 అంగుళాల ధర రూ.29,900 నుంచి ప్రారంభమవుతుంది.

## గూగుల్ మెసేజెస్‌లో స్కామ్ డిటెక్షన్..

### బ్రౌజర్‌లోనే ప్రైస్ ట్రాకర్

ఆండ్రాయిడ్ యూజర్ల కోసం గూగుల్ కొత్త ఫీచర్లను తీసుకొచ్చింది. మోసపూరిత సందేశాలు పెరుగుతున్న నేపథ్యంలో తన మెసేజింగ్ యాప్‌లో వాటిని గుర్తించి బ్లాక్ చేసే సదుపాయాన్ని తీసుకొచ్చింది. దీంతో పాటు ఫైండ్ మై డివైజ్ యాప్ ద్వారా లొకేషన్ షేరింగ్, బ్రౌజర్‌లో ప్రైస్ ట్రాకింగ్ వంటి సదుపాయాలను కూడా ప్రకటించింది.

### స్కామ్ మెసేజ్‌లకు చెక్

ప్రపంచవ్యాప్తంగా సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో మోసపూరిత సందేశాల నుంచి యూజర్లను రక్షించేందుకు తన మెసేజింగ్‌యాప్‌లో ‘స్కామ్ డిటెక్షన్’ ఫీచర్‌ని తీసుకొచ్చింది. దీని సాయంతో సులువుగా స్కామ్ మెసేజ్‌లను గుర్తించవచ్చని తెలిపింది. ఎస్సెమ్మెస్‌లు, ఎమ్మెమ్మెస్‌లు, ఆర్‌సీఎస్ ద్వారా వచ్చే సందేశాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో గుర్తిస్తుంది. స్పామ్ మెసేజులను గుర్తించి అలర్ట్ చేస్తూ సదరు మెసేజ్‌ని రిపోర్ట్ లేదా బ్లాక్ చేయాలని సూచిస్తుంది. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలను ఇది పర్యవేక్షిస్తుంది. దీంతో వ్యక్తిగత సంభాషణలకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఈ స్కామ్ డిటెక్షన్ ఫీచర్‌ను తొలుత అమెరికా, బ్రిటన్, కెనడాలో రోలవుట్ చేస్తోంది. త్వరలోనే మిగిలిన దేశాల్లోనూ అందుబాటులోకి రానుంది.




## రష్మిక 400 కోట్ల సినిమా.. ఈసారి కష్టమే?

యానిమల్ 900 కోట్లు, పుష్ప 2 1800 కోట్లు, ఛావా 600 కోట్లు.. రష్మిక మందన్నా ఈ మూడు బ్లాక్ బస్టర్లతో తన స్థాయిని కొత్త లెవెల్ కి తీసుకెళ్లింది. ఇంకా ఛావా తెలుగు వెర్షన్ రిలీజ్ కాకపోవడంతో, ఈ సినిమాకు కలెక్షన్లు మరింత పెరిగే ఛాన్స్ ఉంది. ఇప్పుడు రష్మిక కేవలం టాలీవుడ్ లోనే కాదు, బాలీవుడ్‌లోనూ స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. అయితే ఆమె విజయ పరంపర కొనసాగుతుందా లేక త్వరలో రాబోయే సికందర్ బ్రేక్ ఇస్తుందా అనే చర్చ నడుస్తోంది. సల్మాన్ ఖాన్ హీరోగా, ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న సికందర్ సినిమా భారీ అంచనాలతో రూపుదిద్దుకుంది. దాదాపు 400 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కానీ మొదటి టీజర్ విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. మురుగదాస్ లాంటి దర్శకుడు ఇంకొంత ఫ్రెష్ కాన్సెప్ట్ తో రావాలని ఫ్యాన్స్ భావించారు. కానీ టీజర్ చూస్తే సికందర్ చాలా రొటీన్ మాస్ ఎంటర్‌టైనర్ గా కనిపిస్తోందని కామెంట్స్ వచ్చాయి. తాజాగా విడుదలైన "జొహ్రా జబీన్" సాంగ్ సినిమాపై ఉన్న నెగటివ్ టాక్‌ను మరింత పెంచింది. సల్మాన్ ఖాన్ ఫిజిక్ ను చూపించేందుకు వీఎఫ్ఎక్స్ ఎక్కువగా ఉపయోగించారనే విమర్శలు వస్తున్నాయి. అతని లుక్ నేచురల్ గా లేదని, గ్రాఫిక్స్ కారణంగా చాలా ఫేక్ గా కనిపిస్తోందని నెటిజన్లు ట్వీట్స్ చేస్తున్నారు. అంతేకాకుండా రష్మిక లుక్ కూడా ప్రేక్షకులకు అంతగా ఆకట్టుకోవడం లేదు. యానిమల్, పుష్ప 2, ఛావా వంటి సినిమాల్లో ఆమె పాత్రకు ప్రాధాన్యత ఉండగా, సికందర్ లో మాత్రం కేవలం గ్లామర్ షోకే పరిమితమైపోయిందనే భావన వ్యక్తమవుతోంది.

## పూజా హెగ్డే ఊరమాస్ సాంగ్

ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత డల్ అయింది. వరుస పరాజయాలతో ఆమెకి అవకాశాలే కరువయ్యాయి. స్టార్ హీరోలతో కలిసి పని చేసిన పూజా హెగ్డే ఇప్పుడు చిన్న హీరోలతో కూడా పని చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తుంది. అయితే పూజా హెగ్డేకి ఇప్పుడు తెలుగులో పెద్దగా అవకాశాలు లేవు. తమిళంలో మాత్రం రెండు సినిమాలు చేస్తుంది. అవి రెండూ భారీ మూవీస్ కావడం విశేషం. సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న కూలీలో స్పెషల్ సాంగ్ కూడా చేయ-బోతున్నట్టు టాక్ వినిపిస్తుంది. ఈ సినిమాలు పూజా హెగ్డేకి ఎంత వరకు ప్లస్ అవుతాయా అని అభిమానులు చర్చించుకుంటున్నారు. పూజా హెగ్డే తెలుగులో ప్రభాస్, ఎన్టీఆర్, మహేష్ బాబు, అల్లు అర్జున్, రామ్ చరణ్, నాగచైతన్య, అఖిల్, వరుణ్ తేజ్ వంటి హీరోలతో నటించింది. క్రేజ్ ఉన్న సమయంలో రెచ్చిపోయింది. రెమ్యునరేషన్ కూడా భారీగానే పెంచేసింది. వచ్చిన అవకాశాలని దేనిని వదులుకోలేదు. అయి-తే ఇందులో కొన్ని దెబ్బ కొట్టడంతో పూజా ఇప్పుడు రూట్ మార్చింది. కంటెంట్ ఉన్న సినిమాలు, బలమైన పాత్రలే చేయాలని అనుకుంటుందట. ఇప్పుడు కోలీవుడ్‌లో పూజా నటిస్తున్న విజయ్..జన నాయగన్, సూర్య..రెట్రో.. చిత్రాలు కూడా అలాంటివే అని తెలుస్తుంది. అయితే క్రేజ్ ఉన్న సమయంలోనే పూజా హెగ్డే రంగస్థలంలో జిగేల్ రాణి అనే స్పెషల్ సాంగ్‌కి చిందులేసింది. ఆ పాట థియేటర్లని ఊపేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు దాన్ని మించి..కూలీలో ఐటెమ్ సాంగ్ ఉంటుందట. అందులో కింగ్ నాగార్జునతో ఈ అమ్మడు ఆడిపాడనుందని అంటున్నారు. ఊరమాస్‌గా ఈ పాట ఉండనున్నట్టు తెలుస్తుండగా, ఇందులో నాగ్‌తో కలిసి పార్టీలో తెగ రచ్చ చేయనుందట. ఇందులో పూజా లుక్ కూడా అదిరిపోయేలా ఉంటుందని అంటున్నారు. కాగా, రజనీకాంత్ కూలీలో నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. నెగటివ్ షేడ్ ఉన్న రోల్ అని సమాచారం. ఇదిలా ఉంటే ఇప్పటికే నాగ్ తనయులు నాగచైతన్యతో ఒక లైలా కోసం, అఖిల్‌తో మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ చిత్రాల్లో నటించిన పూజా హెగ్డే ఇప్పుడు నాగార్జునతో చిందులేయడం హాట్ టాపిక్‌గా మారింది.





## చీర కట్టులో అందాల రాశి

'ఊహలు గుసగుసలాడే' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయం అయిన రాశి ఖన్నా తక్కువ సమయంలోనే పలువురు యంగ్ హీరోలకు జోడీగా నటించింది. కెరీర్ ఆరంభంలో కాస్త బరువు ఎక్కువగా అనిపించిన రాశి ఖన్నా తెలుగు ప్రేక్షకుల కోసం, టాలీవుడ్‌లో ఎక్కువ సినిమాల్లో నటించే అవకాశం కోసం రాశి ఖన్నా బరువు తగ్గింది. బరువు తగ్గిన తర్వాత రాశి ఖన్నా పేరుకు తగ్గట్టు మరింత అందంగా ఉందని అభిమానులు కామెంట్స్ చేశారు. సోషల్ మీడియాలో రాశి ఖన్నా గురించి రెగ్యులర్‌గా ప్రచారం జరిగేలా ఆమె అందం ఉంటుంది అనడంలో సందేహం లేదు. ఈమధ్య కాలంలో తెలుగులో కాస్త ఆఫర్లు తగ్గడంతో తమిళ్‌లో ఈ అమ్మడు బిజీ అయ్యే ప్రయత్నాలు చేసింది. లక్కీగా ఈమధ్య తమిళ్, హిందీలో వరుసగా ఆఫర్లు దక్కుతున్నాయి. తెలుగులో ఈమె చివరగా థాంక్యూ లో నాగ చైతన్యతో కలిసి కనిపించింది. ఆ తర్వాత రాశి ఖన్నా తెలుగు వెండి తెరపై కనిపించలేదు. కానీ హిందీ, తమిళ్‌లో మాత్రం చాలానే సినిమాల్లో నటించింది. ప్రస్తుతం తెలుగులో తెలుసు కదా అనే సినిమాలో నటిస్తుంది. ఆ సినిమాతో రాశి ఖన్నా మళ్లీ టాలీవుడ్‌లో బిజీ కావాలని అభిమానులు కోరుకుంటున్నారు. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను ఈ అమ్మడు షేర్ చేయడం మనం చూస్తూనే ఉంటాం. తాజాగా మరోసారి రాశి ఖన్నా తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి చీర కట్టు అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. గ్రీన్ కలర్ చీరలో స్లీవ్‌లెస్ బ్లౌజ్ ధరించి నడుము అందం చూపిస్తూ కన్నుల విందు చేసింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు దాటినా, వయసు మూడు పదులకు చేరిన రాశి ఖన్నా మాత్రం ఇంకా 20 ఏళ్ల పడుచు అమ్మాయి మాదిరిగా చాలా అందంగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో రాశి ఖన్నా అందమైన చీర కట్టు ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఇంతటి అందంకు టాలీవుడ్‌లో ఆఫర్లు దక్కక పోవడం విడ్డూరంగా ఉందని కామెంట్స్ వస్తున్నాయి.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com